26-03-2024
మంగళవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 278
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8| మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

# గ్యారంటీలే అస్త్రాలు




## లోక్‌సభ ఎన్నికల్లో 'పాంచ్‌న్యాయ్' హామీలను ప్రయోగించనున్న కాంగ్రెస్

### తెలంగాణ, కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహంతో ముందుకు

ప్రజాపక్షం/ హైదరాబాద్

తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో విజయవంతమైన' గ్యారెంటీల' అస్త్రాన్నే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎఐసిసి ప్రయోగించనుంది. కర్నాటకలో ఐదు గ్యారెంటీలు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే వేగంగా జనాలలోకి దూసుకుపోయింది. అదేబాటలో పాంచ్ న్యాయ్(ఐదు న్యాయాలు) పేరుతో ముఖ్య మామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని జాతీయ కాంగ్రెస్ నిర్ణయించింది. అసలు మ్యానిఫెస్టో విడుదల ఆలస్యమైనప్పటికీ, గ్యారెంటీల పేరుతోనే ప్రజల వద్దకు ప్రధాన హామీలను ముందే చేరవేయడంలో తెలంగాణ, కర్నాటక కాంగ్రెస్ శ్రేణులు సక్సెస్ అయ్యాయి. ఇదే నమూనాను ఎఐసిసి వచ్చే నెల నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలలో కూడా అవలంభించనుంది. అందులో భాగంగానే రెండు రాష్ట్రాల్లో విజయవంతమైన గ్యారంటీ హామీల నమూనాలో కొన్నిటిని తీసుకొని, దేశమంతటా పాంచ్ న్యాయ్( ఐదు గ్యారెంటీలు) ఎజెండాతో కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల బరిలోకి దూకింది. ప్రధానంగా మహిళలు, రైతులు, యువత ఓట్లను ఆకట్టుకునేలా పాంచ్ న్యాయ్ పథకాలను రూపొందించింది. తెలంగాణ, కర్నాటకలో తరువాయి 2లో



త్వరలోనే కెసిఆర్ 'ఎన్నికల ప్రచార షెడ్యూల్'
'ఆరు గ్యారంటీలు'
నీరు, వ్యవసాయం, విద్యుత్ అంశాలే బిఆర్ఎస్ ప్రచార అస్త్రాలు

# పరిమితమైన స్థానాలపైనే 'గులాబీ' గురి..?

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక పూర్తయిన నేపథ్యంలో ఇక ఎన్నికల ప్రచారానికి బిఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. ఒక వైపు బిఆర్ఎల్‌పి కాంగ్రెస్‌లో విలీనం అవుతుందనే ప్రచారం, మరోవైపు వెంటాడుతున్న పలు తరువాయి 2లో

# హోరెత్తిన హోలీ సంబురాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా హోలీ సంబురాలు హోరెత్తాయి. వేడుకలు ఘనంగా జరిగాయి. హ్యాపీ హోలీ అంటూ యువత సోమవారం తెల్లవారుజాము నుంచే పండుగ సంబరాల్లో మునిగిపోయారు. రంగుల పండుగ వేడుకల్లో రాష్ట్రం సరికొత్త అందాలను సంతరించుకుంది. ముఖ్యంగా హోలీ వేడుకల్లో యువత ఉత్సాహం అంతా ఇంతా కాదు. చిన్నా, పెద్దా అంటూ తేడా లేకుండా అందరూ కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ రంగుల పండుగను ఉత్సహభరిత వాతావరణంలో నిర్వహించుకున్నారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువుల తరువాయి 2లో





మనవడితో కలిసి

## హోలీ వేడుకల్లో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హోలీ సంబురాలు నిర్వహించారు. ఇంట్లోనే మనవడితో రంగుల ఆట ఆడారు. మనవడు రేయాన్‌తో కలిసి హోలీ వేడుకలు ఆస్వాదించారు. మనవడికి రంగులు పూస్తూ, మనవడితో రంగులు పూయించుకుంటూ సిఎం రేవంత్ రెడ్డి చిన్న పిల్లోడిలా ఆటలు ఆడారు. మనవడి చిరునవ్వులు తరువాయి 2లో

ఈతకు వెళ్లి

# ఆరుగురు మృతి

### పండుగ వేళ పలుచోట్ల విషాదాలు

ప్రజాపక్షం / హైదరాబాద్/ కొమురంభీం ఆసిఫాబాద్

రంగుల పండుగ వేళ పలు జిల్లాల్లో విషాదం చోటుచేసుకుంది. వివిధ చోట్ల ఈతకు వెళ్లి ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఇందులో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉండడం విషాదకరం. కుమురంభీం జిల్లాలో హోలీ పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. నదిలో స్నానానికి వెళ్లి నలుగురు యువకులు మృత్యువాతపడ్డారు. సోమవారం ఉదయాన్నే మిత్రులందరితో హోలీ సంతోషంగా జరుపుకున్న నలుగురు, అనంతరం జిల్లాలోని కౌటాల మండలం తాటిపెల్లిలో వార్ధా నదిలో స్నానం చేయడానికి తరువాయి 2లో





ఉజ్జయిని మహాకాళీ ఆలయంలో

# భారీ అగ్నిప్రమాదం

### 14 మంది పూజారులకు తీవ్ర గాయాలు

**ఉజ్జయిని :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళీ ఆలయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 14 మంది పూజారులకు తీవ్ర గాయాలైనట్లు ఓ అధికారి చెప్పారు. సోమవారం ఉదయం 5.50 గంటల సమయంలో గర్భగుడిలో భస్మహారతి కార్యక్రమం నిర్వహిస్తుండగా మంటలు చెలరేగినట్లు ఉజ్జయిని కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ తెలిపారు. గాయపడిన 14 మంది పూజారుల్లో కొంతమంది జిల్లా ఆసుపత్రిలో మరికొంత మంది ఇండోర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. జిల్లా పంచాయతీ సిఇఒ మృణల్ మీనా, అదనపు కలెక్టర్ అంకూల్ జైన్‌లు విచారణ జరిపి మూడు రోజుల్లో నివేదిక సమర్పిస్తారని నీరజ్ కుమార్ తెలిపారు. గులాల్ సమర్పిస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయన్నారు. కాగా ఘటన తరువాయి 2లో

జెఎన్‌యు విద్యార్థి సంఘ ఎన్నికల్లో

## వామపక్ష విద్యార్థి సంఘాల

# విజయదుందుభి






ప్రధానమైన నాలుగు స్థానాల్లో క్లీన్‌స్వీప్
అధ్యక్షుడిగా ధనుంజయ్,
ప్రధాన కార్యదర్శిగా ప్రియాన్షీ,
ఉపాధ్యక్షుడిగా అభిజిత్ ఘోష్,
జాయింట్ సెక్రెటరీగా సాజిద్ (ఎఐఎస్ఎఫ్) గెలుపు
ఎబివిపికి షాక్

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) విద్యార్థి సంఘ ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాల విజయదుంధుభిని మోగించాయి. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎబివిపిని ప్రధానమైన నాలుగు స్థానాలలోనూ ఓడించి క్లీన్ స్వీప్ చేశాయి. నాలుగేళ్ళ విరామం తరువాత జరిగిన ఈ ఎన్నికల్లో జెఎన్‌యు.. వామక్ష విద్యార్థి సంఘాల ఖిల్లాగా మరోసారి నిరూపించుకున్నది. ఈ ఎన్నికల్లో జెఎన్‌యు అధ్యక్షునిగా ధనుంజయ్ (ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా)), ప్రధాన కార్యదర్శిగా ప్రియాన్షీ ఆర్యా (బిర్సా అంబేద్కర్ పూలే స్టూడెంట్స్ అసోసియేషన్ – బాప్సా), ఉపాధ్యక్షులుగా అభిజిత్ ఘోష్ (ఎస్ఎఫ్ఐ), జాయింట్ సెక్రెటరీగా మొహమ్మద్ సాజిద్ (ఎఐఎస్ఎఫ్)లు ఘన విజయం సాధించారు. వామపక్ష విద్యార్థి సంఘాలైన ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్ ( ఎఐఎస్ఎ), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఫ్రంట్ (డిఎస్ఎఫ్)లు యునైటెడ్ లెఫ్ట్ ప్యానల్‌గా కూటమిగా తరువాయి 2లో

# తాగునీటి వృథా... 22 కుటుంబాలకు జరిమానా




**బెంగళూరు:** కర్నాటక రాజధాని బెంగళూరు నగరవాసులను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో నీటిని పొదుపు చేసేందుకు అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు. అనవసర పనులకు తాగునీరు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నీటి వథాపై సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టారు. తమ ఆదేశాలు ఉల్లంఘించినందుకు 22 కుటుంబాలకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. నీటికొరత కారణంగా తాగునీరు సంరక్షణకు తాము ఇచ్చిన ఆదేశాలు ఉల్లంఘించినందుకు తరువాయి 2లో


# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు

### 41 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్




అకాల వర్షాలతో వారం రోజులు ఊరట పొందిన రాష్ట్ర ప్రజలు భానుడి ప్రతాపం తట్టుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. గత రెండు రోజుల్లోనే పగటి ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు పెరిగాయి. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఎండలు మండుతున్నాయి. మరో మూడు, నాలుగు రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, వేడి గాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటాయి. రాత్రి పూట 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. సోమవారం మధ్యాహ్నం వరకు నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 41.1, డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత నిజామాబాద్ మోర్తాడ్‌లో 41 డిగ్రీలు, ఆసిఫాబాద్ (కుమ్రంభీం) 40.9, చాప్రాలా (ఆదిలాబాద్) 40.8, రైనిగూడెం (సూర్యాపేట) 40.7, కోరట్‌పల్లి (నిజామాబాద్) 40.7, వడ్డేమాన్ (మహబూబ్ నగర్) 40.6, దస్తూరాబాద్ (నిర్మల్) 40.6, ఆదిలాబాద్ 40.5, సిరికొండ 40.5, డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు టిఎస్ డిపిఎస్ వెల్లడించింది. రాబోయే రోజులు ఉష్ణోగ్రతలు మరో రెండు మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉదయం సమయంలో స్వల్పంగా ఆకాశం మేఘావృతమై ఉంటున్నది. మధ్యాహ్నం వరకు ఎండ దంచికొడుతున్నది. ఇక హైదరాబాద్‌లోనూ తరువాయి 2లో



పపువా న్యూగినీలో

# భారీ భూకంపం

**పోర్ట్ :** పశ్చిమ పపువా న్యూగినీలోని మారుమూల ప్రాంతంలో పెను భూకంపం సంభవించింది. 6.9 తీవ్రతతో వచ్చిన భూకంప ధాటికి ఐదుగురు మృతి చెందగా, వేలాది ఇళ్లు నేలమట్టమైనట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 6.20 గంటల (స్థానిక కాలమానం ప్రకారం) ప్రాంతంలో తూర్పు సెపిక్ రీజియన్‌లోని తరువాయి 8లో

ముస్లిం చేసిన 'భారత్ మాతా కీ జై' నినాదాన్ని

# సంఘ్ పరివార్ విడనాడుతుందా?

### ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా మార్చడానికి బిజెపి ప్రయత్నం

### సిఎఎకు వ్యతిరేక సభలో కేరళ ముఖ్యమంత్రి విజయన్ సూటిప్రశ్న



**మలప్పురం (కేరళ) :** 'భారత్ మాతా కీ జై', 'జై హింద్' నినాదాల రూపకర్తలు ఇద్దరు ముస్లింలని, వాటిని వదిలేయడానికి సంఘ్ పరివార్ సిద్ధంగా ఉందా అని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు. దేశ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లిం పాలకులు, సాంస్కృతిక చిహ్నాలు, అధికారులు గణనీయమైన పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. పినరయ్ విజయన్ చరిత్రను ఉదహరిస్తూ అజీముల్లా ఖాన్ అనే ముస్లిం వ్యక్తి 'భారత్ మాతా కీ జై' నినాదాన్ని, అబిద్ హసన్ అనే మాజీ దౌత్యవేత్త మొదట 'జై హింద్' నినాదాన్ని లేవనెత్తారని ఆయన వివరించారు. 'ఆ నినాదాన్ని ఎవరు రూపొందించారు? అతని పేరు అజీముల్లా ఖాన్ అని సంఘ్ పరివార్‌కు తెలుసో లేదో నాకు తెలియదు. ఈ నినాదాన్ని ముందుకు తెచ్చింది ముస్లిం కావడంతో ఆ నినాదాన్ని ఇవ్వడం వారు ఆపేస్తారో లేదో కూడా తనకు తెలియదు' అని ఆయన వ్యాఖ్యానించారు. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా సోమవారం రాష్ట్రంలో సిపిఐ(ఎం) నిర్వహించిన వరుసగా నాలుగో ర్యాలీలో విజయన్ ప్రసంగించారు. ఆయన అన్నారు. మొఘల్ చక్రవర్తి తరువాయి 2లో





# భద్రాద్రిలో వసంత శోభ

ప్రజాపక్షం/భద్రాచలం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి రామాలయం పరిసరాలు వసంత శోభితమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయం ప్రాంగణంలో సోమవారం వసంతోత్సవం, డోలోత్సవాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 17న మిథిలా స్టేయడంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తలంబ్రాలు తయారీ ప్రక్రియను సాంప్రదాయబద్ధంగా ప్రారంభించడంతో సీతారాములు పెళ్లి పనులు షురువయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని ఉత్సవమూర్తులకు పంచామృతాలు, సహస్రధారలతో స్నపనం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో తయారు చేసిన ఉయాలలో సీతారాములను ఆశీనులను గావించారు. ఆలయ ఆస్థాన గాయకులు రామదాసు, తరువాయి 2లో

## వేడుకల్లో పాల్గొన సిఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)



చూస్తూ రేవంత్ రెడ్డి మురిసిపోయారు. ఈ సంబరాల్లో రేవంత్ రెడ్డి అర్ధాంగి గీతా రెడ్డి కూడా పాలుపంచుకున్నారు. సిఎం ఇంట జరిగిన హోలీ సంబరాలకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేశాయి. రేవంత్ రెడ్డి చిన్న కుమార్తె నైమిష కుమారుడే రేయాన్స్. తల్లితండ్రులు అతనికి రేయాన్స్ అని నామకరణం చేయగా, రేవంత్ రెడ్డి తనకు ఇష్టమైన రుద్రదేవుడు అని పేరుపెట్టుకున్నారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే రాగల ఐదురోజులు ఎండ తీవ్రత కొనసాగు అవకాశం ఉందన్నారు. ఉదయం సమయంలో పొగమంచు పరిస్థితులుంటాయని తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి శ్రావణి చెప్పారు. రాత్రిపూట 2526 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ఎండల తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. ఏప్రిల్, మే మాసాల్లో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందన్నారు.

### భారీగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు కాగా, మిగతా జిల్లాల్లో 39 డిగ్రీలు నమోదైంది. ఫిబ్రవరి నెలలోనే ఎండల తీవత్ర కనిపించింది. గత వారం మాత్రం అకాలవర్షాలతో ప్రజలు కొంత ఊరట పొందారు. దక్షిణ దిశ నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయి.

### ఉక్కపోతతో ఇక్కట్లకు గురవుతున్న నగర వాసులు..

హైదరాబాద్‌లో సైతం 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేడి, ఉక్కపోతతో నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాది తరహాలోనే ఈసారి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. హైదరాబాద్‌లో మార్చి నెలలో రెండోసారి పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. అత్యధికంగా సరూర్ నగర్‌లో 40.7, గోషామహల్, సికింద్రాబాద్ లలో 40.4 డిగ్రీలు, ఉప్పల్‌లో 40.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతతో నగరవాసులు ఎండలకు అల్లాడిపోతున్నారు. రాత్రి సమయంలో సైతం ఉక్కపోత తప్పడం లేదు. అందుకే ప్రజలు నీళ్లు ఎక్కువగా తాగాలని, బయటకు వెళ్లేవారు కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వయోవృద్ధులు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య అత్యవసరమైతే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు.

## ఆరుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లారు. ఈ క్రమంలో లోతు గమనించకుండా నదిలో దిగారు. కాగా నలుగురికి ఈత రాకపోవడంతో ఒకరికి వెనకాల మరొకరు నదిలో గల్లంతయ్యారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానికుల సహాయంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఘటనా స్థలానికి కొద్దిదూరంలో నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరంతా కౌటాల మండలం నదీమాబాద్‌కు చెందిన సంతోష్ కుమార్ (25), ప్రవీణ్ (23), సాయి (22), కమలాకర్ (22)గా గుర్తించారు. అందరూ 25 ఏళ్లలోపు యువకులే. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తెల్లవారుజామునే హోలీ ఆడుకోవడానికి సంతోషంగా వెళ్లిన తమ వారు విగతజీవులుగా మారడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు దండేపల్లి మండలం పతమామిడిపల్లికి చెందిన ఓ యువకుడు వాగులో స్నానానికి దిగి మృత్యువాతపడ్డాడు. మరో చోట ఓ 8వ తరగతి విద్యార్థి చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాతపడిన ఘటన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడకు చెందిన మంద నరేశ్ కుమార్ (12) అనే విద్యార్థి ఆదివారం చెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలు, ఫైర్ సిబ్బందితో కలిసి సాయంత్రం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున చెరువులో విద్యార్థి మృతదేహం లభించింది. మృతుడు నరేశ్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## 22 కుటుంబాలకు జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఈ చర్యలు చేపట్టినట్లు బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి బోర్డు తెలిపింది. తాగునీటిని కార్ వాషింగ్ లేదా గార్డెనింగ్ వంటి అవసరాలకు వాడినందుకుగాను నగరంలోని వివిధ ప్రాంతాల్లో 22 కుటుంబాల నుంచి మొత్తం రూ.1.1లక్షల మేర జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించింది. దక్షిణ ప్రాంతం నుంచే అత్యధికంగా రూ.80 వేలు జరిమానాగా వసూలు చేసినట్లు పేర్కొంది. నగరంలో నీటి కటకటను దృష్టిలోఉంచుకొని తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఇటీవల నీటి సరఫరా బోర్డు ప్రజలకు సూచించింది. వాహనాలు కడగడం, నిర్మాణాలు, వినోద సంబంధిత కార్యక్రమాల కోసం తాగునీరు వాడొద్దని కోరింది. తమ ఆదేశాలు ధిక్కరిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. మళ్లీ ఈ చర్య పునరావతమైతే ప్రతి సారీ రూ.500 అదనంగా జరిమానా విధించాలని నిర్ణయించింది. మరోవైపు, హోలీ వేడుకల సందర్భంగా ప్రజలు కావేరీ, బోరుబావుల నీటిని పార్టీలు, రెయిన్ డ్యాన్స్‌ల కోసం వినియోగించొద్దని సూచించింది. అనవసర నీటి వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా ఎయిరేటర్లు అమర్చేలా హోటళ్లు, అపార్టుమెంట్లు, పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఓ వినూత్న కార్యక్రమాన్ని తీసుకొచ్చింది.

## భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పట్ల ప్రధాని నరేంద్రమోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాల్లో స్థానిక అధికారయంత్రాగం అండగా నిలవాలని ప్రధాని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఉజ్జయిని ఆలయాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడుతూ గర్భగుడిపై హోలీ రంగులు పడకుండా రక్షణగా సిల్వర్‌వాల్‌పై వస్త్రాలు వేశారన్నారు. అయితే ఆరతి నుంచి మంటలు రెలరేగి గులాల్ ద్వారా వ్యాపించాయా లేదా గులాల్‌లో ఉన్న రసాయనాల ద్వారా వంటలు వచ్చాయా అనేక ఇంకా తెలియరాలేదన్నారు. గాయపడిన వారికి ఒక్కొక్కరి చొప్పున రూ. లక్ష సహాయం చేస్తామని, మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా ఘటన మొత్తం సిసిటివిల్లో రికార్డు అయిందని ఓ అధికారి చెప్పారు. అయితే హోలీ సందర్భంగా పూజలు నిర్వహిస్తుండగా గులాల్ విసిరినప్పుడు మంటలు ప్రారంభమయ్యాయని పూజారి అశీష్ మీడియాకు చెప్పారు. ఆలయంలోని నందిని హాల్‌లో ఘటన జరిగిన సమయంలో వివిఐపిలు సహా పెద్దసంఖ్యలో భక్తులు ఉన్నారన్నారు.

# విజయదుంధుభి

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేశాయి. నాలుగు ప్రధాన పోస్టులతో పాటు 42 స్కూల్ కౌన్సిలర్ పోస్టులకు హోరాహోరిగా ఎన్నికలు జరిగాయి. గడిచిన 12 ఏళ్ళలో అత్యధికంగా 73 శాతం ఓట్లు పోలయ్యాయి. సుమారు 5,600 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలుత ఎబివిపి అధిక్యతను ప్రదర్శించినప్పటికీ ఆదివారం అర్ధరాత్రి 11:30 గంటలకు వెలువడిన తుది ఫలితాలలో వామపక్ష విద్యార్థి కూటమి స్పష్టమైన ఆధిక్యతతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష, జాయింట్ సెక్రెటరీ స్థానాలను కైవసం చేసుకున్నాయి.

### మూడు దశాబ్దాల తరువాత అధ్యక్షుడిగా దళిత విద్యార్థి

అధ్యక్షునిగా పోటీ చేసిన ధనుంజయ్(ఎఐఎస్ఎ) తన సమీప ఎబివిపి ప్రత్యర్థి ఉమేశ్ సి అజ్మీరాపై 1,676 ఓట్లతో ఘన విజయం సాధించారు. బీహార్ రాష్ట్రంలోని గయా ప్రాంతానికి చెందిన ధనుంజయ్.. దళిత విద్యార్థి. 1996-97 లో ఎన్నికైన భట్టీ లాల్ బైరవా తరువాత మూడు దశాబ్దాలకు జెఎన్‌యు అధ్యక్షునిగా దళిత విద్యార్థి ఎన్నికవడం ఇదే ప్రథమం . వామపక్ష కూటమి తరుపున ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన స్వాతి సింగ్ పై ఎబివిపి ఫిర్యాదుతో పోలింగ్ రోజున అనర్హత వేటు వేశారు. దీంతో బాప్సా నుండి ప్రధాన కార్యదర్శిగా బరిలో ఉన్న ప్రియాన్షీ ఆర్యకు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆమె తన సమీప ఎబివిపి ప్రత్యర్థి అర్జున్ ఆనంద్‌పై 926 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఉపాధ్యక్ష పదవికి అభిజిత్ ఘోష్ (ఎస్ఎఫ్ఐ) 927 ఓట్లతో ఎబివిపి అభ్యర్థి దీపికా శర్మపై ఘన విజయం సాధించారు. జాయింట్ సెక్రెటరీ పదవికి మొహమ్మద్ సాజిద్(ఎఐఎస్ఎఫ్) తన సమీప ఎబివిపి ప్రత్యర్థి గోవింద్ డాంగిపై 508 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

### లాల్ సలామ్ - జై భీమ్ నినాదాలతో హోరెత్తిన జెఎన్‌యు




ఫలితాలు వెలువడిన వెంటనే లాల్ సలామ్, జై భీమ్ నినాదాలతో జెఎన్‌యు క్యాంపస్ హోరెత్తింది. ఎరువు, తెలుపు, నీలి జెండాలతో విద్యార్థులు విజయోత్సవాలలో పాల్గొన్నారు. గెలిచిన అనంతరం జెఎన్‌యు నూతన అధ్యక్షుడు ధనుంజయ్ మాట్లాడుతూ ద్వేషపూరిత, హింసాయుత రాజకీయాలను తిరస్కరిస్తూ జెఎన్‌యు విద్యార్థులు తీర్పును ఇచ్చారని అన్నారు. క్యాంపస్‌లో మహిళా విద్యార్థులకు రక్షణ, నిధుల కోత, స్కాలర్‌షిప్‌ల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు.

## సంఘ్ పరివార్ విడనాడుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

షాజహాన్ కుమారుడు దారా షికో అసలు సంస్కృత గ్రంథం నుండి 50కి పైగా ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువాదాలు చేయడం వల్ల భారతీయ గ్రంథాలు ప్రపంచమంతటా చేరాయని విజయన్ అన్నారు. భారత్ నుంచి ముస్లింలను పాకిస్థాన్‌కు పంపించాలని వాదిస్తున్న సంఘ్ పరివార్ నాయకులు, కార్యకర్తలు ఈ చారిత్రక విషయాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఇతరులతో పాటు ముస్లింలు కూడా కీలక పాత్ర పోషించారని విజయన్ గుర్తు చేశారు.

### ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా మార్చడానికి ప్రయత్నం

కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సిఎఎ అమలు ద్వారా దేశంలో ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని విజయన్ విమర్శించారు. ప్రజాస్వామ్య స్పృహ ఉన్న కేరళ ప్రజలు ఈ చర్యను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరని ఆయన అన్నారు.పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వంటి పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన శరణార్థులకు పౌరసత్వం ఇవ్వాలని కేంద్రం చెబుతుండగా, వలస వచ్చిన ముస్లిం శరణార్థుల పౌరసత్వాన్ని చట్టవిరుద్ధం చేయడమే దాని అసలు లక్ష్యం అని ఆయన అన్నారు. బిజెపి నాయకత్వంలోని భారత ప్రభుత్వం తప్ప ప్రపంచంలోని ఏ దేశం కూడా శరణార్థులను మత ప్రాతిపదికన విభజించలేదని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత నిరసనలు, వివిధ దేశాల నుంచి వ్యతిరేకత ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళుతున్నదని, ఇది ఫాసిస్ట్ పాలకుడు అడాల్ఫ్ హిట్లర్ తీసుకున్న వైఖరిని పోలి ఉందని ఆయన అన్నారు.

దీనిపై దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేసిందన్నారు. వివాదాస్పద సిఎఎ చట్టంపై దేశం మొత్తం నిరసనలు తెలుపుతున్న తరుణంలో కాంగ్రెస్ ఎంపిలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారని ఆయన ఆరోపించారు. నిరసనల సమయంలో కాంగ్రెస్ నేతలు ఎవరూ లేరని, రాహుల్‌గాంధీ విదేశాల్లో ఉన్నారని, వామపక్ష నేతలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారని విజయన్ అన్నారు. ఢిల్లీలో సిఎఎ వ్యతిరేక నిరసనకారులపై సంఘ్ పరివార్ హింసకు పాల్పడినప్పుడు అల్లర్లకు కేంద్రం మౌనంగా అనుమతి ఇచ్చిందని ఆయన గ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సిద్ధాంతం, నిర్మాణం అడాల్ఫ్ హిట్లర్ ఫాసిస్ట్ సిద్ధాంతాల నుండి స్వీకరించబడిందన్నారు.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త ఎమ్ఎస్ గోల్వాల్కర్ రాసిన పుస్తకంలో 'క్రిస్టియన్లు, ముస్లింలు, కమ్యూనిస్టులు దేశ అంతర్గత శత్రువులు' అని పేర్కొన్నారని విజయన్ ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ భావజాలం ఏ పురాతన గ్రంథాలు, పురాణాలు లేదా వేదాలు లేదా మనుస్మృతి నుండి కాదు. హిట్లర్ నుండి తీసుకోబడింది' అని ముఖ్యమంత్రి విజయన్ ఆరోపించారు.

## భద్రాద్రిలో వసంత శోభ

(మొదటి పేజీ తరువాయి)



తూము నర్సింహదాసు కీర్తలను గానం చేస్తుండగా నక్షత్ర, కుంభ హారతులు సమర్పించారు. అనంతరం డోలోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆగమశాస్త్రం ప్రకారం హోలీ సందర్భంగా రామయ్యకు వసంతోత్సవం, డోలోత్సవాన్ని నిర్వహించారు. రామయ్యపై రంగునీళ్లు చల్లిన రోజున రామయ్యను పెళ్లికుమారునిగా తయారు చేసినట్లు భక్తులు భావిస్తారు. ముందుగా ప్రధాన ఆలయంలో ధృవమూర్తులకు, ఆంజనేయ స్వామికి, లక్ష్మీ తాయారమ్మవారికి వసంతాన్ని చల్లి వసంతోత్సవ వేడుక నిర్వహించారు. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ స్వాములకు భాజా భజంత్రీలతో తిరువీధి సేవ నిర్వహించారు.

**తలంబ్రాల తయారీకి శ్రీకారం ...** సీతారాముల కళ్యాణ మహోత్సవానికి వినియోగించే తలంబ్రాల తయారీకి కూడా సోమవారం శ్రీకారం చుట్టారు. చిత్రకూట మండపంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తొలుత రుత్వికుల ధర్మపత్నిలతో పసుపు దంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాం ఇఓ ఎల్ రమాదేవి సైతం పసుపు దంపే వేడుకలో పాల్గొన్నారు. అనంతరం తలంబ్రాలను పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్క గులాం, అత్తర్, పన్నీరు, నూనె, సుగంధ ద్రవ్యాలను కలిపి సిద్ధం చేశారు. తొలి విడతగా 100 క్వింటాళ్ల తలంబ్రాలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓతో పాటు ఏఇఓ శ్రావణ్ కుమార్, భవాని రామకృష్ణ, కత్తి శ్రీను, నిరంజన్, ప్రధానార్చకులు, స్థానాచార్యులుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

**గోటి తలంబ్రాలు..** తలంబ్రాల తయారీలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున తెలుగు రాష్ట్రాల నుండి కాలినడకన తరలివచ్చారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు గోటితో వలచిన తలంబ్రాలను తీసుకొచ్చి అత్యంత భక్తిశ్రద్దలతో స్వామికి సమర్పించారు.

# రంగులు దేశ వైవిధ్యానికి ప్రతీక

### దేశ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ద్రౌపది ముర్ము, మోదీ, షా

**న్యూఢిల్లీ:** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. హోలీ రంగులు దేశ వైవిధ్యానికి ప్రతీకలని ఆమె అన్నారు. సోమవారం ఓ సందేశంలో ఆమె మాట్లాడుతూ 'హోలీ ప్రజల ప్రేమ, ఐక్యత, సోదర భావాన్ని పెంపొందిస్తుంది. దేశ సాంస్కతిక వారసత్వాన్ని బలోపేతం చేస్తుంది. ఈ రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాన్ని తీసుకురావాలి. కొత్త ఉత్సాహంతో దేశ నిర్మాణానికి కషి చేయడానికి మనందరికీ శక్తినివ్వాలి' అని అన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ దేశ పౌరులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్‌లో సంబంధిత పోస్ట్‌ను షేర్ చేశారు. "అనురాగం, సామరస్యం అనే రంగులతో అలంకరించిన ఈ సంప్రదాయ పండుగ మీ జీవితాల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని తీసుకురావాలి" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో హోలీ ఆనందం, శ్రేయస్సు, సామరస్యం, కొత్త శక్తిని తీసుకురావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా శుభాకాంక్షలు తెలిపారు.

## 'గులాబీ 'గురి..?

(మొదటి పేజీ తరువాయి)

కేసులు ఈ క్రమంలో బిఆర్ఎస్ శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపేలా ఎన్నికల ప్రచార శైలి ఉండాలని ఆ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు భావిస్తున్నారు. రాష్ట్రమంతటా పర్యటించినప్పటికీ గెలిచేందుకు అవకాశం ఉన్న కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని యోచిస్తున్నారు. అయితే ఏ నియోజకవర్గంలో గట్టి పోటీ ఉంటుంది?, ఏ నియోజకవర్గంలో కాంగెస్, బిజెపి బలంగా ఉంటాయి, ఎక్కడ బిఆర్ఎస్‌కు ఓటమి అనేది ఆ పార్టీ ఇది వరకే ఒక అంచనాకు వచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని 'ఎన్నికల రూట్'ను రూపొం దించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించాల్సిన ప్రధాన అంశాలను కూడా బిఆర్ఎస్ కసరత్తు చేసింది.

ముఖ్యంగా కాంగ్రెస్ ఎన్నికల సమయం ఇచ్చిన 'ఆరు గ్యారంటీ'లతో పాటు నీరు, విద్యుత్, వ్యవసాయ అంశాలను ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా విస్తృతంగా ప్రచారం చేయాలని బావిస్తోంది. ఇందులో భాగంగా ఎండిపోయిన పంటలను మాజీ మంత్రి టి.హరీశ్‌రావు సందర్శించి, రైతులను పరామర్శించినట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా శాసనసభ నియోజక వర్గాలకు ఇన్‌చార్జ్‌లను కూడా నియమిస్తున్నారు.

### 'గండం' గట్టెక్కేనా..

'సంక్షోభ గండం' నుండి బయటపడేందుకు లోక్‌సభ ఎన్నికలకు ఒక వేదికగా చేసుకోవాలని బిఆర్ఎస్ చూస్తోంది. కేసులను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే, పార్టీని వీడకుండా నేతలను కాపాడుకోవడం బిఆర్ఎస్‌కు పెద్ద సమస్యగా మారింది. తాజా రాజకీయ పరిణామాలతో గులాబీ శ్రేణుల్లో చాలా మంది బిఆర్ఎస్ కార్యాకలాపాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

ఎంపి అభ్యర్థులను ప్రకటించినప్పటికీ చాలా మంది అభ్యర్థుల్లో గెలుస్తామనే విశ్వాసం లేదని వారి అనుచరులు, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పలు సర్వేలు, రాజకీయ విశ్లేషణల్లో కూడా బిఆర్ఎస్‌కు రెండు నుండి మూడు స్థానాలకే పరిమితం చేస్తున్నాయి. మరికొందరు సీనియర్ రాజకీయ నేతలు మాత్రం బిఆర్ఎస్ తీవ్రంగా కష్టపడితే అతికష్టం మీద కేవలం ఒకటి, లేదా రెండు స్థానాలకే పరిమితం కావాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు.

లోక్‌సభ స్థానాల్లో బిఆర్ఎస్‌కు తగిన ఎంపి స్థానాలు రాకపోతే ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు లేకపోలేదని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

## గ్యారంటీలే అస్త్రాలు

(మొదటి పేజీ తరువాయి)

గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించి ఓటర్ల ఆదరణను చూరగొంది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో దాదాపు గ్యారెంటీలను అన్ని అమలు చేసేందుకు ఇరు రాష్ట్రాల కాంగ్రెస్ ప్రభుత్వాలు దాదాపుగా సఫలమయ్యాయి. తెలంగాణలో ఇప్పటికే అమలు చేసిన అయిదు గ్యారంటీలు, వంద రోజుల ప్రజా పాలన ను ప్రజలు ఆశీర్వదించాలని జనంలోకి వెళ్తోంది.

**మన గ్యారెంటీలను మరింత పెంచారు :** గతంలో తెలంగాణ, కర్నాటకలో మహిళలు, రైతులు, యువత, కార్మికులు, అణగారిన వర్గాలకు ఇచ్చిన గ్యారెంటీలను మరింత విస్తృత పరుస్తూ పాంచ్ న్యాయ్‌ను రూపొందించారు. వీటిని ఇప్పటికే ఎఐసిసి కీలక నేత రాహుల్‌గాంధీ తన భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ప్రకటించారు. పాంచ్ న్యాయ్ కింద ఐదు గ్యారెంటీలు, ఒక్కో దానికి ఉపగ్యారెంటీలు కలిపి 25 గ్యారెంటీలు మ్యానిఫెస్టోగా ప్రకటించనున్నారు. మహిళల కోసం నారీ గ్యారెంటీ, రైతుల కోసం కిసాన్ న్యాయ్, యువత కోసం యువ న్యాయ్, కార్మికుల కోసం శ్రామిక్ న్యాయ్, అణగారిన వర్గాల కోసం హిస్సేదారి (భాగస్వామ్యం) న్యాయ్‌లను రాహుల్ గాంధీ ప్రకటించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మీ గ్యారెంటీ పేరుతో మహిళలు ఉచిత బస్సు పథకానికి అమలు చేశారు. ఆ తరువాత మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు కొత్త ప్రభుత్వం వడ్డీ మాఫీ, బీమా పథకాలను ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు ఏడాదికి రూ.లక్ష, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీ న్యాయ్ హామీ పథకాన్ని రాహుల్‌గాంధీ ప్రకటించారు. రాష్ట్రంలో బిసిల కుల గణనకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిని మరింత విస్తృపరుస్తూ భాగీదారీ న్యాయ్ పేరుతో దేశమంతటా కుల గుణన చేపడతామని, ఎంత జనాభానో అంత వాటా ఇస్తామని , 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ ప్రచారాస్త్రాన్ని సంధించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ ను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో హామీ ఇవ్వటం గమనార్హం. కుమ్రంభీం జల్ జంగల్ జమీన్ నినాదం స్ఫూర్తితో సాగు చేసుకుంటున్న అటవీ భూములపై ఆదివాసీలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే హక్కులు కల్పించింది. పెండింగ్ లో ఉన్న అప్లికేషన్లను అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు పరిష్కరిస్తామని ఈ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. రైతుల కోసం కిసాన్ న్యాయ్ ప్రకటించి, దాని ద్వారా పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత, అప్పుల బాధ నుంచి రైతులకు ఉపశమనం కల్పించేందుకు శాశ్వత రైతు రుణమాఫీ కమిషన్, పంట నష్టపోయిన రైతులకు 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లించే హామీలను ఇచ్చింది. శ్రామిక్ న్యాయ్ కింద ఉపాధి హామీ పథకంలోనూ రోజూ కనీస కూలీ రూ.400 తో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చింది. యువ న్యాయ్ కింద 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెంటర్‌ను ప్రకటిస్తామని, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.8,500 లేదా ఏటా రూ.1లక్ష ఇస్తామని ప్రకటించారు.

**రాష్ట్రానికి లాభమే:** కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఊరటనిస్తుంది. అప్పులు ఊబిలో కూరుకుపోయి ఖజానాకు ఊతాన్ని ఇస్తుంది. తెలంగాణలో ఆరు గ్యారెంటీల పరిధిని పెద్దది చేస్తూ ఎఐసిసి పాంచ్ న్యాయ్‌లను ప్రకటించింది. తద్వారా ఇక్కడ ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఆర్థికంగా వెసులుబాటు లభించడంతో పాటు , బడ్జెట్‌పై భారం గ్గిపోతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# హోరెత్తిన హోలీ సంబురాలు

(మొదటి పేజీ తరువాయి)



మధ్య హైదరాబాద్ నగర వాసులు పండుగను జరిపారు. దీంతో నగరం మొత్తం ఎక్కడ చూసినా రంగులమయంగా మారిపోయింది. స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లీ మరి రంగులు చల్లారు. మరోవైపు సికింద్రాబాద్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, పీపుల్స్ ప్లాజాలో హోలీ ఈవెంట్‌లు ఏర్పాటు చేశారు. డిజెలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈవెంట్‌ల నిర్వాహకులు అదరగొట్టారు. డిజె సౌండ్ పాటలతో ఊర్రుతలూగిపోయారు. సికింద్రాబాద్ తార్నాకలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో బల్దియా కార్మికుల హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం హోలీ వేడుకలు నిర్వహించుకున్నారు. ప్రతి ఏడాది ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు హోలీ పండుగను జరుపుకుంటారు. అలాగే గత రాత్రి కామ దహన కార్యక్రమం ఘనంగా జరిగింది. హోలీ పండుగకు ముందు రోజు కాముడిని దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. హోలీ పండుగను పురస్కరించుకుని కరీంనగర్ లోక్‌సభ బిజెపి అభ్యర్థి బండి సంజయ్ కరీంనగర్‌లో పండుగ సంబురాల్లో పాల్గొన్నారు. ఉదయం ఆయన ఇంటి వద్దకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి వచ్చి బండిపై రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఇంట్లో సతీమణితో కలిసి హోలీ సంబురాలు జరుపుకున్న బండి సంజయ్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులకు రంగులు పూశారు. అనంతరం ద్విచక్ర వాహనంపై వీధుల్లో తిరుగుతూ కనిపించినవారందరికీ రంగులు పూసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ యువత హోలీ సంబరాలతో హోరెత్తించారు. పరస్పరం రంగులు పూసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిజామాబాద్‌లో డిజె పాటలకు నృత్యాలు చేస్తూ హోలీకి సరికొత్త శోభను తెచ్చారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల పండగను రెట్టింపు ఉత్సాహంతో జరుపుకున్నారు. నిర్మల్ ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నారు. ఎస్‌పి జానకి శర్మిల, ఎఎస్‌పి కాంతిలాల్ పటేల్ సిబ్బందితో కలిసి రంగులు చల్లుకున్నారు. డిజె పాటలకు సిబ్బంది నృత్యాలు చేసి సందడిచేశారు. రామగుండం సిపి శ్రీనివాస్ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో హోలీ ఆడారు. రంగుల వేడుకను ప్రతీ ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రంగులు పూసి సందడి చేశారు. తాను సైతం కార్యకర్తలకు రంగుల పుశారు. అనంతరం తెలంగాణ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ రంగుల పండుగను ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకుని సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. తమ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్‌పి సుధీర్ రంనాథ్ సిబ్బందితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. డిజె పాటలకు స్టెప్పులు వేస్తూ అలరించారు. ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ రంగుల పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా హోలీ పండగ సంబరాలు అంబరాన్ని తాకాయి. పండగను సంతోషకర వాతావరణంలో సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరిజిల్లా నాగాయపల్లి తండాలో గిరిజన బంజారాలతో కలసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంబరాలు ఉత్సహంగా చేసుకున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా హోలీ జోష్ కన్పించింది. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వేడుకల్లో పాల్గొని నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేడుకలు ఉత్సహంగా జరపుకుని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఐదుగురు అభ్యర్థులతో కాంగ్రెస్ ఆరో జాబితా

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ మరికొద్ది రోజుల్లో జరగబోయే లోక్ సభ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థుల ప్రకటనలో బిజీగా మారాయి. అయితే అభ్యర్థుల ప్రకటనలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్య నేతలు, సీనియర్ నేతలు, కొత్త నేతలు ఇలా అన్ని వర్గాలను బేస్ చేసుకుని అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఐదుగురు అభ్యర్థులతో కూడిన ఆరో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రాజస్థాన్ నుంచి నలుగురిని, తమిళనాడు నుంచి ఒకరిని ప్రకటించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ స్థానం నుంచి రామచంద్ర చౌదరి, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్, భీల్వారా నుంచి డాక్టర్ దామోదర్ గుర్జర్, కోట నుంచి ప్రహ్లాద్ గుంజాల్‌లు బరిలో నిలిచారు. వీరితో పాటు తమిళనాడులోని తిరునల్వేలి లోక్‌సభ స్థానం నుంచి న్యాయవాది సి.రాబర్ట్ బ్రూస్‌కు టికెట్ ఇచ్చారు. గుంజాల్ గురువారమే కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు ముఖ్య అనుచరుడు. ఇంతకు ముందు రెండుసార్లు కోటా నుంచి ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారు. కాగా ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థుల ఐదో జాబితాను విడుదల చేసింది. తాజాగా జాబితాతో కాంగ్రెస్ ఇప్పటి వరకు 190 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది.

## సర్వీసు టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి : ఎస్‌టియు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సర్వీసులో ఉన్న టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వి.సుధాకర్‌డిమాండ్ చేశారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు రెగ్యులర్ డైట్, బిఎడ్ అభ్యర్థులతో సమానంగా టెట్ నిర్వహించడం సమంజసం కాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాభై సంవత్సరాల వయస్సు పైబడి, 2010కన్నా ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిలబస్‌లో ఉన్న అసంబద్ధ అంశాలను తొలగించి ఆయా సబ్జెక్టుల మీదనే మాత్రమే పరీక్ష నిర్వహించాలని, గతంతో పోలిస్తే ఫీజు భారం ఐదు రెట్లు పెరిగినందున ఫీజును తగ్గించాలని, కామన్ క్వాలిఫయింగ్ మార్కులను నిర్దేశించాలని కోరారు.

## బిఆర్‌ఎస్ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేరును ఆ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సోమవారం ప్రకటించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాలకు బిఆర్‌ఎస్ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది.

**బిఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థులు :** ఆదిలాబాద్ ఆత్రం సక్కు, మల్కాజిగిరి రాగిడి లక్ష్మారెడ్డి, ఖమ్మం నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ మాలోత్ కవిత, కరీంనగర్ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి కొప్పుల ఈశ్వర్,మహబూబ్‌నగర్ మన్నె శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్ కడియం కావ్య,జహీరాబాద్ గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ బాజిరెడ్డి గోవర్ధన్,సికింద్రాబాద్ టి.పద్మారావుగౌడ్,నాగర్‌కర్నూల్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్,భువనగిరి క్యామ మల్లేశ్,నల్లగొండ కంచర్ల కృష్ణారెడ్డి, మెదక్ వెంకట్రామిరెడ్డి, హైదరాబాద్ గడ్డం శ్రీనివాస్ యాదవ్.

## పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవు

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి, పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మీడియాలో ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవన్నారు. గాంధీ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్ణయాలను అందరూ ఆమోదించాల్సిందే అన్నారు. అభిప్రాయాలను అంతర్గతంగా తెలియచేయాలని సూచించారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి, ఎవరూ మాట్లాడినా, ఎంత సీనియర్ నేత అయిన చర్యలు తీసుకుంటామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.




## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. వనపర్తి బిజెపి, బిఎస్‌పికి చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నా రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధనలక్ష్మి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవల్లి మండలం చిన్నారం, గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ రావు, ఎంపిటిసిలు ఒల్లమ్మ, శాంతన్నలతో పాటు వందకుపైగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ చేరారు.

## రైతు అప్పుల చెల్లింపుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అప్పులను చెల్లించాలని రైతులను వేధించకుండా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంక్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వకుంటే లక్షలాది మంది రైతులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎవ్వరూ బ్యాంకుల అప్పు కట్టకూడదని,బ్యాంకు అధికారులు ఎక్కడైనా బిఆర్‌ఎస్ నేతల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. యాసంగి వడ్లు వస్తున్నాయని, ఈ సారి మద్దతు ధరకు రూ.500ల బోనస్‌ను కలిపి ఇవ్వకపోతే కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు.రైతులు ధైర్యంగా ఉండాలని,ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. బోనస్ కోసం రైతులు కూడా ప్రభుత్వంపైన ఒత్తిడి పెంచాలన్నారు. పంట నష్టం పై వచ్చిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని, రాజకీయాలు మాని రైతులకు మేలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.అప్పులు చెల్లించాలని బ్యాంకు అధికారులు రైతులకు లీగల్ నోటీసులు ఇస్తున్నారన్నారు.రుణాలు కట్టాల్సిందేనని రైతులపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు బ్యాంకు అధికారులు పడుతున్నారని,బ్యాంకులకు రాజకీయాలకు సంబంధమే లేదని వారు చెబుతున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన నాలుగు ప్రధాన హామీలను అమలు చేయలేదని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. నష్ట పోయిన రైతుల వివరాలు ప్రభుత్వం వెంటనే సేకరించాలన్నారు. ఎన్నికల కోడ్ ప్రకృతి వైపరీత్యాల సాయానికి అడ్డు కాకూడదన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, పంటలు ఎండుతున్నప్పటికీ ప్రభుత్తానికి చీమ కుట్టినట్టుగా లేదన్నారు. తండాల్లో తాగు నీరు కూడా సరిగా రావడం లెదన్నారు. సాగు నీరు లేదని, కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియదని వివరించారు. ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధరణి లో మార్పులు అంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సిలు మధుసూదనచారి,దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు .

# శ్రామికవర్గంకోసం పోరాడిన కృషీవలుడు పొట్లూరి

### 16వ వర్ధంతి సభలో ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** అసాధారణమైన ట్రేడ్ యూనియన్ నాయకుడిగా శ్రామికవర్గం కోసం జీవితాంతం పోరాడిన కృషీవలుడు పొట్లూరి నాగేశ్వర్ రావు అని ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సోమవారం ప్రముఖ కార్మిక నేత, ఎఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పొట్లూరి నాగేశ్వర్ రావు 16వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా పొట్లూరి చిత్రపటానికి ఉజ్జిని రత్నాకర్ రావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం. నరసింహ అధ్యక్షతన జరిగిన సభలో ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ మెరుగైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనాలు, మెరుగైన సామాజిక భద్రతా చర్యల కోసం జరిగిన అనేక పోరాటాలకు పొట్లూరి నాగేశ్వర్ రావు నాయకత్వం వహించారని గుర్తు చేసారు. డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్, కె.ఎల్. మహేంద్ర వంటి ట్రేడ్ యూనియన్ దిగ్గజాల స్ఫూర్తితో సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికుల హక్కుల కోసం పొట్లూరి నిరంతరం ఉద్యమాలు నిర్మించేవారని గుర్తు చేశారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉండి, కార్మికులను సంఘటితం చేసి, బలమైన ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను నిర్వహించి, అనేక ఉద్యమాలు, సమ్మెలు చేసి విజయవంతంగా కార్మికవర్గం సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని, సమ్మె చేసే హక్కుతో సహా కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను నేటి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయని, తిరిగి న్యాయమైన కార్మిక చట్టాలు, హక్కులు సాధించేవరకు పొట్లూరి పోరాట స్ఫూర్తిని, త్యాగాన్ని ఆదర్శంగా తీసుకొని మీరంత ముందుకు సాగాలని ఉజ్జిని రత్నాకర్ రావు పిలుపునిచ్చారు. ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు , శ్రేయస్సును అభివృద్ధి చేయడంలో తన జీవితకాలమంతా అలుపెరగని పోరాటం చేసిన గొప్ప కార్మిక నాయకుడు పొట్లూరి నాగేశ్వర్ రావు అని ప్రశంసించారు. కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల మూసివేత, కార్మికుల తొలగింపు, వేతనాల కుదింపుకు గురై కార్మికుల జీవితాలు రోజురోజుకు దుర్భరమైపోతున్న ప్రస్తుత తరుణంలో కార్మికవర్గ పోరాటాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నవారికి పొట్లూరి పోరాటాలు స్ఫూర్తినిస్తాయని ఎస్. బాలరాజ్ తెలిపారు. బి.వెంకటేశం మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికవర్గ అభ్యున్నతి కోసం పొట్లూరి నాగేశ్వర్ రావు రాజీలేని పోరాటాలు చేసారని గుర్తు చేసారు. అసంఘటిత రంగ కార్మికులు ముఖ్యంగా ఆటో రంగ కార్మికుల హక్కుల కోసం నిబద్ధతతో అయన చేసిన ఉద్యమాలకు తామంతా ప్రభావితమయ్యామని బి.వెంకటేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు బి. వెంక టయ్య, ఎండి. ఒమర్ ఖాన్, కొంరెల్లి బాబు, ఎస్.కె. లతీఫ్, కృష్ణ, జగన్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లోనూ జెఎన్‌యు ఫలితాలే

### మత మౌఢ్యాన్ని చొప్పించే బిజెపి భావజాలాన్ని వ్యతిరేకించిన జెఎన్‌యు విద్యార్థులు

### హర్షం వ్యక్తంచేసిన ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు

**ప్రజాపక్షం / హైదరాబాద్ / హనుమకొండ :** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థుల కూటమి విజయదుందిభి మోగించడం పట్ల ఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ హర్షం వ్యక్తం చేశారు. జెఎన్‌యులో వచ్చిన ఫలితాలే త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి రావడం ఖాయమన్నారు.

ఈ మేరకు సోమవారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. జెఎన్‌యుఎస్‌యు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా లెఫ్ట్ అభ్యర్థి ధనంజయ్, ఉపాధ్యక్షు డిగా వామపక్ష అభ్యర్థి అవిజిత్ ఘోష్, ప్రధాన కార్యదర్శిగా లెఫ్ట్ మద్దతిచ్చిన బిఎపిఎస్ఎ అభ్యర్థి స్వాతి, సంయుక్త కార్యదర్శిగా లెఫ్ట్ అభ్యర్థి మహమ్మద్ సాజిద్ ఎన్నిక కావడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను, వ్యవస్థలను హరిస్తున్న, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న మోడీని ఓడించేందుకు దేశ ప్రజలు కంకణం కట్టుకున్నారని వారు అన్నారు.

**మతోన్మాద శక్తులకు స్థానం లేదని సంకేతం**

పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఎబివిపి విద్యార్థి సంఘాన్ని వామపక్షాల కూటమి ఓడించి తమ సత్తా చాటిందని తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో వామపక్ష కూటమి ఘన విజయం సాధించడం సంతోషకరమన్నారు. ఈ విజయం మతోన్మాద శక్తులకు స్థానం లేదని సంకేతమిచ్చిందన్నారు.

రానున్న కాలంలో మతోన్మాద శక్తులు ఆగడాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు నిచ్చారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి**

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులు విజయం సాధించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి అని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షు లు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర కొనియాడారు. యునైటెడ్ లెఫ్ట్ కూటమితో ఎన్నికలు జరిగాయని, ఈ ఎన్నిక ల్లో ప్రత్యర్థి ఎబివిపి మోడీ విధానాలతో ప్రచారం నిర్వహించారని, మోడీ నిరంకుశ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారి దేశాన్నే నాశనం చేస్తున్నాయని భావించిన జెఎన్‌యు విద్యార్థు లు ఎబివిపిని ఓట్లద్వారా తిరస్కరించారని అన్నా రు.

**మతోన్మాద శక్తులకు చెంపపెట్టు :**

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి కూటమి జయకేతనం మతోన్మాద శక్తులకు, మోడీ ప్రభుత్వానికి చెంపచెట్టు లాంటిదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధా న కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు.

రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కూడా అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థి లోకం మతోన్మాద విద్యార్థి సంఘాలను తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా ధ్వంసం చేసి కార్పోరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఓడించడానికి యువత, విద్యార్థి లోకం కంకణబద్దులు కావాలన్నారు.



## వాళ్లది విద్వేషం — మాది ప్రజాశ్రేయస్సు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/జహీరాబాద్ :** 2023 రాష్ట్ర అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మహిళలు ఎక్కడ ప్రయాణించిన ఉచితంగా ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని, ఇప్పటివరకు ప్రభుత్వ పథకంలో భాగంగా ఇప్పటివరకు లక్షల సంఖ్యలో మహిళలు ప్రయాణించి లబ్ధిపొందుతున్నారని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అల్లిపూర్ వార్డులో మాజీ ఎంపిటిసి అశోక్ స్వగృహంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా॥ ఆగం చంద్రశేఖర్ తో కలిసి పత్రిక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ఇండియా కూటమి విజయం సాధించడం ఖాయం అని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలు 100శాతం ఖచ్చితత్వంతో అమలు చేసే పార్టీ అని, దేశంలో ఒక రాజకీయ లబ్ది కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ లబ్ది కోసం ప్రయత్నాలు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ భావితరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ ప్రజల శ్రేయస్సు తప్ప వేరే అంశాలను ప్రాధాన్యత ఇవ్వదని, రాష్ట్రంలో అధికారంలో వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలలో ఇప్పటికే సగానికి పైగా అమలు చేస్తున్నామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అయిన సురేష్ కుమార్ షెట్కర్ కు అత్యధిక మెజారిటీతో గెలిపించి జహీరాబాద్, తెలంగాణ, భారత దేశం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డా ఆగం చంద్రశేఖర్, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, కోహిర్ మండల అధ్యక్షుడు రామలింగ రెడ్డి, జహీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# కేంద్ర వైఖరికి నిరసనగా 30న రాష్ట్ర సదస్సు

### 11 వామపక్ష పార్టీల నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ మార్చి 30న రాష్ట్ర సదస్సు నిర్వహించాలని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయి.

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశాయి. సదస్సుకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం,, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్య దర్శి సాధినేని వెంకటేశ్వరరావు, జె.వి. చలపతిరావు(సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), గాదగోని రవి (ఎంసిపిఐ (యు), ప్రసాదన్న (సిపిఐ(ఎంఎల్) ), రమేశ్ రాజా (సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), జానకిరాములు(ఆర్ఎస్‌పి), సి.హెచ్. మురహరి (ఎస్‌యుసిఐ(సి)), బి. సురేందర్ రెడ్డి(ఫార్వర్డ్ బ్లాక్)లు సోమవారం ఒక సంయుక్త పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనదని విమర్శించారు. ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తూ, మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదని అన్నారు. నియంతృత్వ విధానాలు అమలు చేస్తున్నదని, . ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని గవర్నర్ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకుంటూ ఆయా ప్రభుత్వాలను పడగొడుతున్నదని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఇడి, ఐటి దాడులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నదని, రాజ్యాంగ విరుద్ధంగా ''పౌరసత్వ సవరణ చట్టం అమలులోకి తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ 30న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ప్రజలను వామపక్ష నేతలు కోరారు.

## ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడుగా బాబూ మోహన్ : కెఎ పాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాశాంతి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ మంత్రి, సిని నటుడు బాబూ మోహన్‌ను ఆ పార్టీ అధినేత కె.ఏ. పాల్ నియమించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా కె.ఏ. పాల్ మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతున్నామని చెప్పారు. ప్రజాశాంతి పార్టీ తరపున తొలి అభ్యర్థిగా వరంగల్ స్థానానికి బాబూ మోహన్‌ను ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. ప్రజాశాంతి పార్టీలో బాబూ మోహన్ చేరిన తర్వాత అనేక మంది పార్టీలో చేరేందుకు వస్తున్నారని చెప్పారు. అయితే ఇటీవలనే బాబు మోహన్ ప్రజాశాంతి పార్టీలో చేరారు. బిజెపి పెద్దల వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి పార్టీ తనని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బాబూ మోహన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. చివరకు ఆయనకు అందోల్ నుంచి బిజెపి టికెట్ ఇచ్చింది. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దామోదర రాజనరసింహ విజయం సాధించారు. బిఆర్‌ఎస్ నుంచి చంటి క్రాంతి కిరణ్ రెండవ స్థానంలో నిలువగా బాబూ మోహన్ మూడో స్థానానికే పరిమితమయ్యారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన వరంగల్ నుంచి పోటీ చేస్తారని కె.ఏ.పాల్ ప్రకటించారు.

# మణికంఠకు పలువురు న్యాయమూర్తుల నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎ.మణికంఠ మరణం పట్ల తెలంగాణ న్యాయమూర్తుల సంఘం,పలువురు న్యాయమూర్తులు నివాళ్లు అర్పించారు. పలువురు న్యాయమూర్తులు, న్యాయమూర్తి సంఘం ప్రతినిధులు సోమవారం హైదరాబాద్,అంబర్ పేటలోని మణికంఠ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మణికంఠ తల్లిదండ్రులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసనిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం మాజీ అధ్యక్షులు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు కె. ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి కె. మురళీ మోహన్, మెట్రోపాలిటన్ సెషన్ న్యాయమూర్తి ప్రేమావతి. న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జీవన్ కుమార్ న్యాయమూర్తుల సంఘ సహాయ కార్యదర్శి కె. దశరథ రామయ్య ఎగ్జిక్యూటివ్ సభ్యులు మండా వెంకటేశ్వర రావు ,ఎం. రాజు, సంపత్, ఫరాన్ కౌసర్,జోనైల్ న్యాయస్థానం న్యాయమూర్తి రాధిక, న్యాయమూర్తి ప్రతిమ తదితరులు మణికంఠకు నివాళ్లు అర్పించి, తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంచి భవిష్యత్ కలిగిన యువ న్యాయమూర్తి మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధాకరమన్నారు.

కాగా బాగ్ అంబర్‌పేట పోచమ్మ బస్తీలోని శ్రీనిధి రెసిడెన్సిలో నివాసం ఉంటున్న ఎ. మణికంఠ (36) నాంపల్లి కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు నెలకొనడంతో ఇటీవల ఆమె కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. మరోవైపు మణికంఠ తల్లి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. భార్యాభర్తల మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగింది. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటా నంటూ మణికంఠ ఫోన్ పెట్టేశారు. అనంతరం పడక గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.



వియాత్నంకు చెందిన మీడియా ప్రొఫెషనల్స్ సోమవారం బుద్ధవనం ప్రాజెక్ట్‌ను సందర్శించింది. హైదరాబాద్‌లోని ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి ఇనిస్టిట్యూట్‌లో ''జర్నలిజం , పబ్లిక్ రిలేషన్'' అంశంపై జరిగిన శిక్షణ నిమిత్తం వారు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బుద్దవనం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధధర్మతాత్వికుడు ఆచార్య నాగార్జునకు చెందిన పలు వీడియోలను తిలకించారు. అనంతరం నాగార్జన కొండను సందర్శించారు.






# దిగజారుతున్న వ్యవస్థను కాపాడేది మీడియానే

### ఎపియుడబ్ల్యుజె సెమినార్‌లో శ్రీనివాసరెడ్డి

**విజయవాడ :** తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి విజయవాడకు వచ్చిన కె.శ్రీనివాసరెడ్డిని జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయనకు విశాలాంధ్ర సంపాదక మండలి చైర్మన్ కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు పుష్పగుచ్చం అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో విశాలాంధ్ర సిబ్బంది సన్మానించారు. వీరితో పాటు విజయవాడ నగరంలోని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా సి.రాఘవాచారి రాసిన సంపాదకీయల మూడవ సంపుటి 'రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు' పుస్తకాన్ని సి. రాఘవాచారి ట్రస్ట్ సభ్యులు బి. జమీందార్, అక్కినేని చంద్ర రావు తదితరులు శ్రీనివాస రెడ్డికి అందించారు.

**మార్పు తెచ్చే శక్తి జర్నలిజానిదేః కె.శ్రీనివాస్ రెడ్డి**

సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి జర్నలిజానికి ఉందని, దిగజారిపోతున్న వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే అని ఇండియా జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడెమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(ఎపియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో 'సార్వత్రిక ఎన్నికలు– మీడియా పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన స్థానిక గాంధీనగర్ లోని శ్రీరామ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎన్నికల సంఘం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తుందన్నారు. మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ వాస్తవాలను బయటపెట్టటానికి సంకోచిస్తుందన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కనీస ఖర్చు రూ.10,702 కోట్లు ఉందన్నారు.

రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బ్యాండ్స్ ద్వారా డబ్బు సమకూరుతుందన్నారు. సదస్సులో ప్రొఫెసర్ ఎం.సి.దాస్, ఐజెయు కార్యదర్శి డి.సోమసుందర్, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేశ్ కుమార్ , ఎపియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి తదితరులు హాజరయ్యారు.

ప్రజాపక్షం

మంగళవారం, మార్చి 26

# ఏకత్రాటిపైకి 'ఇండియా' కూటమి

శృతిమించిన మోడీ ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కోవటం ఎన్నికలతో ముడిపడిన అంశం మాత్రమే కాదు. రాజకీయ పోరాటం కూడా. ఒకవైపు సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూలు ప్రకటన జరిగి, తొలిదశ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన తదుపరి కూడా సహజ న్యాయసూత్రాలను తుంగలోతొక్కి ప్రతిపక్షాలను అణచివేసే అనైతిక కృత్యాలకు ఈ ప్రభుత్వం పాల్పడుతున్నప్పుడు, ఆ అప్రజాస్వామిక చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లటం, బహిరంగ వేదికలనుంచి వాటిని ఖండించటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే, ప్రేమించే శక్తుల కర్తవ్యం.

అవినీతి నిర్మూలన పేరుతో ప్రతిపక్షాలనే లక్ష్యంగా ఎంచుకుని భాజపా–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎంచుకున్న ప్రతిపక్ష నాయకులపై ప్రయోగిస్తున్నది. ప్రతిపక్ష నాయకులు కొందర్ని కేసులు–అరెస్టులతో బెదిరించి లొంగదీసుకుంటున్నది. లొంగనివారిని కక్షసాధింపుగా వేధిస్తున్నది. ఇందుకు తాజా ఉదాహరణ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు. అంతకుముందు జెఎంఎంనేత, జార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బిఆర్ఎస్ నాయకురాలు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుమార్తె కవిత అరెస్టు కూడా బిజెపి రాజకీయ క్రీడలో భాగంగానే భావించాల్సి ఉంటుంది. అయితే దేశాన్ని ఏలాలనుకున్న దురాశలో టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్చిన కెసిఆర్ రెంటికిచెడ్డ రేవడి కావటంతో జాతీయస్థాయిలో లేదా రాష్ట్రస్థాయిలో ఆయన కుమార్తె కొమ్ముగాసేవారు లేకుండాపోయారు. ఆమెది తన, తన కుటుంబ న్యాయ పోరాటంగా దిగజారింది. అవినీతిపై పోరాటం గూర్చి బిజెపి, ప్రధాని మోడీ చెప్పేమాటలకు, చేస్తున్న ప్రచారానికి ఏమైనా విలువవుందా? కర్నాటక రాజకీయ–వ్యాపారవేత్త, రాజశేఖరరెడ్డి–జగన్మోహనరెడ్డి కుటుంబ మిత్రుడు, ఓబులాపురం గనుల నుండి ఇనుప ఖనిజం అక్రమ త్రవ్వకం – ఎగుమతిదారుగా అవినీతిలో పీకలోతు కూరుకుపోయి అప్రతిష్టపాలైన గాలి జనార్దనరెడ్డిని సోమవారంనాడు బిజెపిలోకి సాదరంగా ఆహ్వానించి ఆలింగనం చేసుకున్న ఉదంతం భ్రష్టాచార్(అవినీతి)పై బిజెపి పోరాటం డొల్ల, మోసపూరితం అని తేటతెల్లం చేయటం లేదా! నాలుగు ఓట్లు, సీట్లకోసం గొంగళి పురుగునైనా ముద్దాడే భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థకు బిజెపి అతీతం కాదు. తమది భిన్నమైనపార్టీ అని ఒకప్పుడు చెప్పుకునేది. సంపూర్ణ అధికారం కోసం ఇప్పుడు అడ్డదారులన్నీ తొక్కుతున్నది. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కుయుక్తులు విఫలమైనాక, ఫిరాయింపుల చట్టం కింద అనర్హతకు గురైన అరడజను కాంగ్రెస్ పూర్వసభ్యులను, మరో ఇద్దరు స్వతంత్రులను మొన్ననే బిజెపిలో చేర్చుకున్నారు. ఇది నీతిమంతమైన రాజకీయమా? అధికారంకోసం అది అవినీతి మార్గాలు అనుసరించిందో, ప్రజల తీర్పుకు విరుద్ధంగా ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలను తన లేబుల్ కిందకు తెచ్చుకుందో సిగ్గుచేటుతనం కాదా!

'ఇండియా' కూటమి భాగస్వాములమధ్య కొన్ని రాష్ట్రాల్లో ఉన్న వైరుధ్యాలను, విభేదాలను గోరంతలు కొండంతలుచేసి చూపుతూ, తమ కూటమిపట్ల ప్రజల విశ్వాసం చూరగొనటానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న బిజెపి, మోడీ ప్రభుత్వం తమ దుందుడుకు చర్యలవల్ల వారిలో ఐక్యతను పటిష్టం చేస్తున్నట్లుంది. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఈనెల 31న ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో 'ఇండియా' కూటమి భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ముఖ్యనాయకులందరూ పాల్గొననున్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి ఎన్నికలముందు వారి నోరు నొక్కటానికి ప్రధానమంత్రి అనుసరిస్తున్న అప్రజాస్వామిక, నియంతృత్వ ధోరణిని వారు ఎండగట్టనున్నారు. ఆదాయపుపన్ను శాఖ ఎన్నికల సందర్భంలో ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలనుంచి డబ్బు డ్రాచేసి ఆ పార్టీని బికారిగా మార్చటంలో ఉద్దేశం ఆ పార్టీ ఎన్నికల పోరాట సామర్థ్యాన్ని అణచివేయటమే కాదా? బిజెపి, మోడీ 370; 400 సీట్లని డంబాచార ప్రచారం చేస్తున్నా, అది ఇండియా కూటమిని భయపెట్టలేదు, విచ్ఛిన్నం చేయలేదు. దానినుండి గట్టి సవాలు తప్పదు!

# తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధపడిన కార్మికసంఘాలు

డా.గ్యాన్ పాథక్

కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పదేళ్లుగా విసిగి వేసారిపోయిన కార్మిక సంఘాలు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మినహా జాతీయస్థాయిలో ఉన్న కార్మిక సంఘాలన్నీ బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. భారతీయ మజ్దూర్ సంఘ్ మాత్రం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నది. మిగిలిన కార్మిక సంఘాలన్నీ ఇప్పటికే కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక (సిటియు)గా ఆవిర్భవించి ఉమ్మడి పోరాటాలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పలు కార్యక్రమాలు చేస్తున్నాయి. ఒకవేళ బిజెపి గనుక మూడోసారి అధికారంలోకి వస్తే ఇక మరిన్ని కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు, చట్టాలను అమలులోకి తెస్తుందని కార్మిక సంఘాల ఐక్యవేదిక దృఢంగా విశ్వసిస్తున్నది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ఈ మధ్యనే ఒక ప్రకటన చేశారు. "దేశంలో కార్మిక సంఘాలకు ఇది చావో బతుకో తేల్చుకోవాల్సిన సమయం, కార్మిక సంఘాలు చాలా స్పష్టతతో ఉన్నాయి, ఇదే మోడీ గనుక అధికారంలోకి వచ్చి మూడోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, కార్మికులకు పోరాటాలు చేయడానికి కూడా అవకాశం ఉండదు, అందుకే ఈ 18వ లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమైనవి, మోడీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తుంది, వారికి ఉన్న ఒకే ఒక్క ఆయుధం పోరాటం, శాంతియుత నిరసన మార్గం, ఇక కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా మళ్ళీ మోడీ కార్మికులకు దక్కనివ్వరు, సమ్మెలు చేయనివ్వరు, దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నామరూపాలు లేకుండా చేసేందుకు, కార్మిక సంఘాలను నామ మాత్రంగా మార్చేసేందుకే మోడీ తెచ్చిన లేబర్ కోడ్స్ ప్రధాన ఉద్దేశం. ఇక ఆయన అధికారం కొనసాగితే ఈ లేబర్ కోడ్స్‌ను పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకువస్తారు, ఇప్పటివరకూ కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించడంవల్లనే ఈ నాలుగు లేబర్ కోడ్లనూ మోడీ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో వాయిదా వేస్తూ వస్తున్నది" అని అమర్‌జీత్ కౌర్ హెచ్చరించారు.

బిజెపి ప్రభుత్వం కార్మికులకు దేశంలో ఇప్పటివరకూ ఉన్న 29 చట్టాలలో చాలా వాటిని సంహరించి ఆ స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చింది. కనీస వేతనాలను సార్వత్రీకరించడమే తమ ఉద్దేశమని, అందరికీ కనీస వేతనాలు అమలు చేయడమే తమ లక్ష్యమని, అదేవిధంగా కార్మికులందరికి సామాజిక భద్రత కల్పిస్తామని, కార్మికుల పని పరిస్థితులను మెరుగుపరుస్తామని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఐతే కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికలో ఉన్న పది జాతీయ కార్మిక సంఘాలు ఒకేమాటకు కట్టుబడి ఉన్నాయి. మోడీ ప్రభుత్వం దేశంలో ఆధునిక బానిసత్వాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని పి సి టి యు స్పష్టమైన అభిప్రాయంతో ఉంది. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఐక్యవేదిక సుదీర్ఘ పోరాటాలు చేస్తున్నది. ఐతే ఈ పోరాటాల ఫలితంగా తలొగ్గిన మోడీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఈ లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా వాయిదా వేసింది. కానీ మరోసారి గనుక బిజెపి అధికారం చేపడితే కార్మికుల పుట్టగతులు లేకుండా చేస్తుంది. గడచిన పది సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం అవిశ్రాంతంగా కార్మిక సంఘాలపై దాడులు చేస్తూనే ఉందని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్,



సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలు ఈ ఐక్యవేదికలో సభ్యులుగా ఉన్నాయి. వీటితో పాటు స్వతంత్ర సంఘాలు, సమాఖ్యలు కూడా సభ్యులుగా ఉన్నాయి. కార్మికుల పని పరిస్థితులను దిగజార్చేందుకు, వారి ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతను దెబ్బతీసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నందునే కార్మికులు పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని పి సి టి యు చెబుతున్నది. దేశంలో మొదటిసారిగా రైతు సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో కూడా కేంద్ర కార్మిక సంఘాలు మమేకమయ్యాయి. కార్మికులు–కర్షకులు సంయుక్తంగా ఉద్యమాలకు పిలుపు ఇస్తున్నారు. ఇటీవలనే ఆనాటి ఫిబ్రవరి 16వ తేదీన పిసిటియు – ఎస్ కె ఎంలు సంయుక్తంగా దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు పిలుపు ఇచ్చాయి. ప్రభుత్వం డ్రోన్ల ద్వారా బాష్పవాయు ప్రయోగం చేసి కార్మికులు, కర్షకులను అణచివేసేందుకు ప్రయత్నించింది.

**అసంఘటిత,వలస కార్మికుల లేబర్‌కోడ్స్‌లో భద్రత లేదు**

ఎంతో కష్టపడి దశాబ్దాలపాటు పోరాటాలు చేసి రక్త తర్పణం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ఉనికిలో లేకుండా చేయాలని, కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ముక్తకంఠంతో చెబుతున్నది. తమ హక్కుల రక్షణ కోసమే తాడో పేడో తేల్చుకునేందుకు కృషి చేస్తున్నట్లు ఐక్యవేదిక చెబుతున్నది. మోడీ చెప్పినట్టుగా ఆయన ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్స్‌లో ఎక్కడా కార్మికులకు అందరికీ ఒకే విధమైన కనీస వేతనం అమలు చేసే విధానం లేదని, వివిధ ప్రాంతాలలో వేరు వేరుగా ఈ కనీస వేతనాలు చాలా హీనస్థాయిలో అమలు చేస్తున్నారని పి సి టి యు చెబుతున్నది. అసంఘటిత కార్మికులకు, సంఘటిత కార్మికులకు కనీస వేతనాల భరోసా ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నాగానీ కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదన్నది కార్మిక సంఘాల ప్రధాన వాదన. 15వ భారత కార్మిక సదస్సు (ఐఎల్‌సి) చేసిన సిఫార్సులను కేవలం నిబంధనల్లో పొందుపరిచారు తప్ప ప్రధానమైన చట్టంలో మాత్రం పొందుపరచకపోవడంతో కార్మికులకు మేలు జరగడంలేదు. వృతిపరమైన భద్రత, కార్మికుల ఆరోగ్యం వంటి విషయాలను మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో నీరు గార్చారు. వాటికి ఏ మాత్రం విలువ ఇవ్వలేదన్నది కార్మిక సంఘాల ప్రధాన విమర్శ. అంతేకాకుండా కార్మికులను అలవికాని పని గంటలతో దోపిడీ చేస్తున్నారు, శ్రమకు తగ్గ వేతనం లేదు, వారి ఉపాధి, ఉద్యోగ భద్రత అంతంత మాత్రమే. పని ప్రదేశంలో వివక్ష, విభిన్నమైన వేతనాలు రాజ్యమేలుతున్నాయన్న కారణంగా కార్మిక సంఘాలు కేంద్రంపై ఐక్యపోరాటాలు కొనసాగిస్తున్నాయి. ఐనాగానీ మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిసిటి యు విమర్శిస్తున్నది. ఇక కాంట్రాక్టు కార్మికులు, వలస కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారు. ఒకేపనిలో ఉన్న కార్మికులు ఏకీకృతమై సంఘటిత పోరాటాలు చేయడానికి లేబర్‌కోడ్‌లు అవకాశం ఇవ్వడంలేదు. వలస కార్మికులు కూడా తీవ్ర వివక్షకు గురవుతున్నారు.

అంతర్రాష్ట్రస్థాయిలో వలస కార్మికులకు ఎలాంటి భద్రత లేదు. చాలా సందర్భాలలో వారు ప్రాణాలు కోల్పోతున్నారు. అంతర్రాష్ట వలస కార్మికులకు చట్టాలలో ఉన్న కొద్దిపాటి భద్రత, సామాజిక ప్రయోజాలు కూడా కొత్త లేబర్ కోడ్‌లలో సోదిలోకి కూడా కనిపించడంలేదని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. అందువల్ల ఈ విధంగా కార్మికులకు ఇప్పటివరకూ ఉన్న హక్కులను కూడా కొత్త లేబర్ కోడ్ లు కాలరాస్తున్నందువల్లనే తాము ఉద్ధృత పోరాటాలకు దిగామని కేంద్ర కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

**కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌కు తావుండదు**

ఇక పారిశ్రామిక సంబంధాల విషయంలో ఈ లేబర్ కోడ్‌లు కార్మికులకు ఏ మాత్రం అనుకూలంగా లేవు. కార్మికుల మౌలికమైన, కనీస హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్నదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కార్మికులు సంస్థాగతంగా ఏకమై, ఉమ్మడి కార్యాచరణకు అవకాశం లేకుండా మౌలిక హక్కులను కూడా లేబర్ కోడ్‌లు హరించాయని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన చెందుతున్నది. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అందుకే వారు పోరాట మార్గం ఎంచుకున్నారు. వారి పోరాటక్రమంలో కర్షకులు కూడా వారికి జత కలిశారు. లేబర్ కోడ్‌లు గనుక నిజంగా అమలులోకి వస్తే ఇక కొత్త కార్మిక సంఘాన్ని రిజిస్టర్ చేసుకోవడం చాలా కష్టంగా మారిపోతుంది. రిజిస్ట్రార్‌లకు ఈ విషయంలో ఏకపక్ష హక్కులు ఇచ్చేశారు. వారు ఇష్టానుసారంగా వ్యవహరించవచ్చు. వారు యూనియన్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయవచ్చు కూడా. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లలో కార్మికులకు ఎక్కడా ప్రత్యేకించి సామాజిక భద్రతకు సంబంధించిన ప్రతిపాదనలు లేవు అని కార్మిక సంఘాలు స్పష్టంగా చెబుతున్నాయి. వారి భద్రతకు సంబంధించిన పథకాల ప్రస్తావన లేదు. అందుకు తగిన వనరులు కేటాయించే ప్రతిపాదనలు ఎక్కడా లేవు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న చట్టాలలో కూడా సామాజిక భద్రత హక్కుల గురించి వాటి నిబంధనల గురించి సరైన స్పష్టత లేదు. అనిశ్చితి ఈ విషయంలో నెలకుని ఉంది. ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలను హేతుబద్ధీకరిస్తామనే పేరుతో వాటిని ఇంకా ఇంకా కార్మికులకు దూరం చేస్తున్నారు. చట్టాలను, వాటి నిబంధనలను లేబర్ కోడ్‌లలో మరింత నీరు గార్చారని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. అంతేకాదు, ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాల నియామకాలు దాదాపుగా స్తంభించాయి. నియామకాలు అడుగంటడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. దీనివల్ల ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరిగింది. ఆధునిక బానిసత్వం అమలులోకి వచ్చింది. హక్కులు హరించుకుపోయాయి.కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు 2.70 లక్షలు తగ్గిపోయాయి. 2013 మార్చి నెలలో 17.30లుగా ఉన్న ఉద్యోగా లు 2022 మార్చి నెల నాటికి 14.60 లకు తగ్గిపోయాయి. అదే సమయంలో కాంట్రాక్టు కార్మికులు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెరిగింది. వీరి సంఖ్య పైన పేర్కొన్న ఇదే కాలంలో 19 శాతం నుండి 42.5 శాతానికి పెరిగింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గడచిన పది సంవత్సరాలలో 65 శాతం మేరకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్టు కార్మికుల, ఔట్ సోర్సింగ్ కార్మికుల నియామకాలు పెరిగాయి. విచిత్రం ఏమిటంటే వీరికి ఏ విధమైన సామాజిక భద్రతలూ లేవు. కనీస వేతనాలు కూడా కరువయ్యాయి. (ఐపిఎ సర్వీస్)

# ధర్మభిక్షం జీవితం ఆదర్శప్రాయం



మార్చి 26: స్వాతంత్ర సమరయోధుడు ప్రజల మనిషి ధర్మభిక్షం 13వ వర్ధంతి

నిజాం నవాబు రాక్షస పాలన, రజాకార్ల ఆగడాలు, భూస్వాములు, జమిందార్ల పెత్తనం పడగవిప్పి బుసకొడుతున్నటువంటి రోజుల్లో ధర్మభిక్షం పేద గీత కార్మిక కుటుంబంలో జన్మించాడు. బాల్యం నుండే ఆయన భావాలు వికసించాయి. సమాజం గురించి, సకల ప్రజానీకం జీవన స్థితిగతుల గురించి, చదువు గురించి, స్వాతంత్ర్యాల గురించి ఆలోచించినటువంటి వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకున్నాడు. కల్లుగీత కుటుంబంలో పుట్టినప్పటికీ ఈ సమాజపు నుదుటి మీద కొత్త రాత రాయాలని, కొత్త గీత గీయాలని తపించాడు. ప్రఖ్యాత విజ్ఞాన శాస్త్రవేత్త, ప్రపంచ శాంతి ఉద్యమకారుడు ఐన్‌స్టీన్ చెప్పినట్లు మన ఆలోచనలు బట్టే మనం సృష్టించుకునే సమాజం ఉంటుందన్న మాటకు నిలువెత్తు రూపం ధర్మభిక్షం. ఆయన జీవితాన్ని చూసినప్పుడు అర్థమవుతుంది. నిజాం పాలన గురించి, రజాకార్ ఆగడాల గురించి స్పష్టమైన ఆలోచనలు ఆయనకున్నవి. ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలుగా శాస్త్రీయమైనటువంటి ఆలోచన, కార్యాచరణ, నిర్మాణాత్మకమైన కార్యాచరణ, అకుంఠిత దీక్షా, దక్షితలు కలిగి ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తే ఎటువంటి దుర్మార్గపు రాచరిక వ్యవస్థ అయినా ప్రజా పోరాటాలకు నేలకూలటం ఖాయమని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. ఆంధ్ర మహాసభ జరుగుతున్న రోజుల్లో నాయకులు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు గార్ల ఉపన్యాసాల గురించి ధర్మభిక్షం విద్యార్థులతో చర్చించేవాడు. అప్పట్లో ఆంధ్రమహాసభలో యువతరానికి నాయకత్వం వహిస్తున్న రావి నారాయణరెడ్డి అతివాద భావజాలంతో కలిసి ధర్మభిక్షం ఆంధ్ర మహాసభల విజయవంతానికి వేలాదిమందిని కదిలించారు. ఆర్య సమాజం వేదికగా జీవహింసకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. మానవత్వాన్ని మరిచిపోయి మతాల కుంపటిలో కాలిపోకుండా, పరిమళ భరితమైన మతసామరస్యం కొరకు అహర్నిశలు కృషి చేశాడు ధర్మభిక్షం.

1942 సంవత్సరంలో నిజాం రాష్ట్రంలో ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ఏర్పడ్డ సందర్భంలోనే సూర్యాపేటలో బలమైన విద్యార్థి యూనియన్ స్థాపించి నిజాం నవాబు పుట్టినరోజు వేడుకలను బహిష్కరింప చేశాడు. బలమైన పోరాటాల ద్వారానే నిజాంరాజు గద్దెను కూల్చాలని అందుకు విద్యార్థి శక్తి ప్రధానమని విద్యార్థుల కొరకు హాస్టల్ స్థాపించాడు. స్వాతంత్ర పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, స్వాతంత్ర్య అనంతరం జరిగిన సామాజిక పోరాటాల్లో ముందున్న ఎంతోమంది నాయకులు ధర్మభిక్షం శిష్యరికంలో, సహచర్యంలో ఎదిగినవారేనని చెప్పవచ్చును. ధర్మభిక్షం ప్రకృతి ప్రేమికుడు. పచ్చని పంటలు, చెట్లు, అడవులు, కొండలు, గుట్టల్లో, నదులు, పక్షులు, జంతువులు, సకల జీవరాశులను ప్రేమించేవాడు. తాటి ఈత వనం అంటే మరీ మక్కువ ఆయనకు, ఎందుకంటే ఈ వనం లక్షలాది కల్లుగీత కార్మిక కుటుంబాలకు జీవనాన్నిస్తుంది. జనుల కార్మికుల ఆకలిదప్పికలను తీరుస్తుంది, అంతేకాదు ఇండ్లులేని పేద ప్రజలకు తాటి కమ్మలు, ఇంటికప్పుగా దూలాలుగా, వంట కట్టెలుగా ఉపయోగపడతాయి. ముంజలు, గేగులు ఆహారంగా తీసుకుంటారు. వృత్తిమీద కుమ్మరి, వడ్రంగి, ఎరుకల తదితర వృత్తుల వారు ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. తన శాస్త్రీయమైన ఆలోచనలతో వీరందరి ప్రగతి కొరకు కుల సంఘాలు కాకుండా వృత్తి సంఘాలను నిర్మించి వారి హక్కుల సంరక్షణకు, సంక్షేమం కొరకు పోరాటాలు నిర్వహించారు. గీత వృత్తి కార్మికులకు కుల సంఘాలు కాకుండా వృత్తి సంఘాలను ఏర్పాటు చేయాలని 70 ఏళ్ల క్రితమే ఆలోచించాడు. కార్మికుల తల రాతలు మార్చాడు. దొరలకు ఊడిగం చేసే బతుకును విముక్తి చేయించాడు. కల్లు గీత సొసైటీలను సాధించి గీత కార్మిక కుటుంబాలలో వెలుగులు నింపాడు. వన పెంపకానికి ఐదు ఎకరాల జిఒను సాధించి గ్రామగ్రామాన తాటి ఈతవనం పెంచటం ద్వారా, వనం గ్యారంటీ, ఉపాధి గ్యారెంటీకి పునాదులు వేశాడు. సమాజంలో అగౌరవానికి గురి అయిన ఈ ప్రాచీన గ్రామీణ వృత్తిని, వృత్తిదారులను సగౌరవంగా తల ఎత్తుకు నిలబడేలా పోరాటాలు చేశాడు. కల్లుని శీతల పానీయంగా ఆధునీకరించాలని, గీత వృత్తిని పరిశ్రమగా అభివృద్ధి చేయాలని, పాన్కోల, పామ్ షుగర్, పామ్ చాక్లెట్ వగైరా లాంటి ఉత్పత్తులకు ఖాది బోర్డుతో కలిసి జాయింట్‌గా పామ్ ఇండస్ట్రీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తన చివరి శ్వాసవరకు పోరాడిన ధీశాలి ధర్మభిక్షం. అబ్కారి శాఖ మంత్రిగా శ్రీ శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ మీద నీరా సెంటర్ ను ఏర్పాటు చేసి ధర్మభిక్షం నీరా డిమాండును అమలుపరిచా రు. ధర్మభిక్షం నడుస్తున్న ఆరడుగుల ఎర్రజెండాలా రెపరెపలాడుతూ పేదల గుండెల్లో కొలువై ఉన్నాడు. గీత జన పితామహుడు, గీత కార్మికుల ఆశాజ్యోతి, గీత కార్మికుల భీష్మాచార్యుడు అని ధర్మభిక్షం గారిని గీత కార్మికులు పిల్చుకుంటూ ఉంటారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు, మూసి, డిండి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం, ప్రాజెక్టులపై పనిచేస్తున్న కూలీల హక్కులు, సంక్షేమం కోసం సంఘం పెట్టి, పోరాటాలు నిర్వహించి, వారి అభ్యున్నతికి కృషిచేసిన మాట ఎవరూ విస్మరించలేని నిజం. అదేవిధంగా గోదావరి, కృష్ణా జలాల ద్వారా సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని వాటికొరకు చట్టసభల వెలుపల, లోపల పోరాడిన నిజాయితీగల ప్రజా ప్రతినిధి. ధర్మ బిక్షం సూర్యాపేటలో మొట్టమొదటి కమ్యూనిస్టు సెల్లును ఏర్పాటు చేశాడు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా, పిడిఎఫ్ యాప్ అభ్యర్థుల ఎన్నికల ఇన్‌ఛార్జిగా, మూడుసార్లు శాసన సభ్యుడిగా, రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ధర్మభిక్షం డిపాజిట్ డబ్బులను ప్రజలే పోగుచేసి ఇవ్వడం జరిగింది. అంతేకాక ప్రజలంతా స్వచ్ఛందంగా, సొంత ఖర్చులతో ధర్మభిక్షం గెలుపుకోసం కృషి చేశారు. అందుకే ఆయన ప్రజల మనిషిగా ఘనమైన నివాళి పొందుతున్నాడు. దేశంలో ఈనాడు అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భం. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పాలకులు రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారు, చట్టసభల గౌరవాన్ని అభాస పాలు చేస్తున్నారు. పాలకుల కార్యక్రమాలలో మతమౌఢ్యం రంకెలు వేస్తుంది. ఫలితంగా మత సామరస్యం దెబ్బతింటుంది. అసహనం పెరిగిపోతుంది. మూకదాడులు కూడా విచ్చలవిడిగా అయిపోతున్నాయి. ప్రశ్నించే గొంతులపై దాడులు, కేసులు పరిపాటి అయిపోయినవి. వ్యక్తుల స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం ఉన్నదా లేదా అనే ప్రశ్నలు కురుస్తున్నాయి. సంక్షేమం పేరు చెప్పి సంక్షోభాలను సృష్టిస్తున్న పాలకుల వికృత చర్యలకు చరమ గీతం పాడాలి. ధర్మభిక్షం జీవితం ఒక తెరిచిన గ్రంథం.. ధర్మభిక్షం ఆశయాల బాటలో సైన్యమై సాగుదాం. మన దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, సెక్యులరిజాన్ని, కాపాడుకోవడానికి విశ్రాంతిలేని పోరాటాలను నిర్వహించినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించిన వాళ్ళమవుతాం...ధర్మభిక్షం గారికి జోహార్లు.. ధర్మభిక్షం గారి ఆశయాలను సాధిద్దాం..

కె.వి.ఎల్. 9490952649

# బిజెపి మళ్లీ గెలిస్తే దేశానికి ప్రమాదం

ఎన్నికల కోడ్ రానే వచ్చింది. వలస పక్షులు ఇప్పుడిప్పుడే గూళ్ళను వెదుక్కుంటూ కుదుటపడుతున్నాయి. బిజెపి అధికారంలోకి రాక ముందు 370 రూపాయలు ఉన్న గ్యాస్ సిలెండర్ అమాంతంగా 2022 నాటికి రూ. 1200 రూపాయలైంది. అరవై రూపాయల ఉన్న లీటరు పెట్రోలు, డీజిల్ రేటు రూ. 110 చేరింది. గత వారం లో గ్యాస్ రెండు వందల రూపాయలు తగ్గించి భారీ వితరణ చాటుకున్నారు ప్రధాని మోడీ. బూటకపు వాగ్దానాలు, అమలు చేయని గ్యారెంటీలతో ఊదరగొడుతున్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల కోసం అప్పనంగా వచ్చిన డబ్బును తగలేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయన ఇటీవల పర్యటించారు. కానీ, ఏమి చేస్తారో... ఏం ఇస్తారో చెప్పలేదు. ఇతర దేశాల్లో ఉన్న నల్ల డబ్బు తెచ్చి, ఒక్కో మనిషికి 15 లక్షలు ఇస్తానని పదేళ్ల క్రితం ఇచ్చిన హామీని, ఆ క్షణమే మరచిపోయారు. సమాన విద్యావకాశాలు లేని నూతన విద్య విధానాన్ని ప్రవేశపెట్టారు. విద్య కాషాయీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణకు పెద్ద పీట వేస్తున్నారు. మోడీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలం లో, ఒక్కటంటే ఒక్క పరిశోధన సంస్థను స్థాపించింది లేదు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో, పేరెన్నిక గల సంస్థలలో ఉద్యోగ క్షీణత నలభై శాతం దాటింది. రాజ్యాంగం నుండి లౌకికవాదాన్ని తొలగించబోమన్న భరోసా ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న వైనాన్ని చెప్పరు. 67ఏళ్ళ సుదీర్ఘకాలంలో భారత్ అప్పులు రూ.55 లక్షల కోట్లుకాగా, తాను ఒక్కరే చేసిన రూ. 80 లక్షల కోట్ల అప్పుల గురించి అసలే మాట్లాడరు. పెట్రోల్ ధర రూపంలో ఆర్జించిన రూ. 26 లక్షల కోట్లు గురించిగానీ, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వసూలు చేసిన రూ. 6,900 కోట్ల గురించిగానీ వివరాలు ఇవ్వకుండా, గొప్పగా గోప్యతను పాటిస్తారు. వ్యాపారులు, కార్పొరేట్లు ఎగవేస్తున్న ఆదాయపు పన్ను గురించి చట్టసభలలో చర్చకు అనుమతించలేదు. కరోనా ప్యాకేజీ రూ.20లక్షల కోట్లు, పిఎం కేర్స్ ఫండ్‌కు వచ్చిన విరాళాలు ఎటుపోయాయి? కార్పొరేటు, ప్రైవేటు ఆసుపత్రులు కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో 6 లక్షల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిన విషయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. మూతపడుతున్న ప్రభుత్వ రంగసంస్థ ల గురించి ఏనాడూ చింతించలేదు. హిడెన్‌బర్గ్ నివేదిక కారణంగా, అదానీ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడినప్పుడు, స్టాక్ మార్కెట్లలో ఆవిరైన సామాన్య మదుపరుల ఆస్తి లక్షల కోట్ల రూపాయలను గురించిన ఆలోచన ప్రధానికి లేనేలేదు. ఇరవై లక్షల కోట్ల రూపాయల మేర కార్పొరేట్ ఎగవేత దారుల రుణాలనుమాఫీ చేయడం, అదానీ ఆస్తులు గత పది సంవత్సరాలలో 26 రెట్లు పెరగడం, కరోనా సమయం లో అంబానీ ఆస్తి గంటకు రూ. 90 కోట్లు పెరగడం చూస్తుంటే మోడీ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారో అర్థం అవుతుం ది. దేశంలోని ఒబిసిల్లో 983 కులాలకు ఐదేండ్లుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రయోజనాలు అందట్లేదు. ఎక్కడ చూసినా అవినీతి, అరాచకం, విధ్వంసాలే. వ్యవస్థలన్నీ పతనమై, నిరుద్యోగితా రేటు 8.4 శాతం పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థలకు దివాలా తీసే పరిస్థితులు సృష్టిస్తున్నారు. బీమా, రైల్వే, కమ్యూనికేషన్, చివరికి ఇస్రో, హెచ్ఎఎల్ వంటి రక్షణ రంగ కంపెనీలను కూడా ప్రైవేటు పరం చేస్తున్నారు. మాటల గారడితో మరోసారి తెరపైకి వచ్చి,400లకుపైగా సీట్లు సంపాదిస్తామని ఒక వైపు ధీమా ప్రకటిస్తూనే, ఓట్లు వేసి ఆదరించాలని వేడుకుంటున్న ప్రధాని మోడీ అద్భుతాలు సృష్టిస్తారన్న భ్రమల నుంచి ప్రజలు బయటపడాలి.

బిజెపిని కట్టడిచేసే క్రమంలో బహుజనుల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజకీయంగా బలపడాలి. దేశ జనాభాలో 54శాతం బిసిలే ఉన్నప్పటికీ, రాజకీయాల్లో మాత్రం వారి పాత్ర అంతంత మాత్రంగానే ఉండడం, వారికి సరైన ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరం. కులా ల లెక్కలు తీయకపోతే బిజెపి గద్దె దిగిపోవాల్సిందే. కులం పేరుతో వివక్షకు గురైన వర్గాల వారికి సమ ప్రాతినిధ్యం దక్కించడం కోసమే రిజర్వేషన్ల వ్యవస్థ' అని, రాజ్యాంగం లోని 15(4), 16(4) అధికరణల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాల్సినవి సంక్షేమ పథకా లు మాత్రమేనని, ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇబిసి వర్గాలకు ఎక్కడ నుండి వచ్చింది? అగ్రకులాల జనాభా ఎంత అనేది తెలియకుండానే వారికి పదిశాతం రిజర్వేషన్లా?అన్ని రకాలుగా రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కుతున్న బిజెపికి ఎందుకు ఓటు వేయాలో ప్రధాని చెప్పలేదు.ఇక మోడీ భక్తుల చూపంతా దేవుడు, భవ్యరామ మందిరం, మతం, కులం, హలాల్, హిజా బ్, మసీదు, జట్కా, ఆవు, పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్‌పైనే. సామాజిక మాధ్యమాలలో పైసాఖర్చు లేకుండా వీటిని ప్రచారం చేస్తున్నారు. హత్రాస్, బిల్కిస్ బానోపై జరిగిన ఘోరాలు, రెజ్లర్లపై లైంగిక వేధింపులు వంటి అకృత్యాలను బిజెపి పాలనలో చూస్తున్నాం.

ఆర్టికల్ 370 రద్దు స్ఫూరణకు తెస్తూ, బిజెపి నేతలు తమకు 370 సీట్లు సొంతంగానే వస్తాయంటున్నారు. ఇవి కేవలం ప్రతిపక్షాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ కొట్టడానికి చేస్తున్న వ్యాఖ్యలే. ఎందుకంటే, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గత పదేళ్లుగా జరిగిన అభివృద్ధి శూన్యం. నిరుద్యోగ సమస్య దేశాన్ని పట్టిపీడిస్తున్నది. పేదరికం తగ్గకపోగా, ఉచిత బియ్యం పొందే జనాభా పెరిగింది. నిత్యావసరాల ధరలు కూడా పెరుగుతునే ఉన్నాయి. దేశంలోని చాలా రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక గాలి వీస్తున్నది. మత సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం ప్రతి మనిషి జీవన విధానం కావాలని ప్రజలు గ్రహించినపుడే పరిస్థితి మారుతుంది. మత విద్వేషాలను ప్రేరేపించే విధానాలు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమని ప్రజలు గుర్తెరగాలి. మెరుగైన సమాజానికి మూలస్థంభాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణం, సాధికారత, విలువలు, సామాజిక సమగ్రతను ప్రజలు విస్మరించి కేవల ం మతం పట్టుకుని వేలాడితే పెను ప్రమాదమని పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ వంటి దేశాల పరిస్థితి స్పష్టం చేస్తున్నది. మెజారిటీ కావచ్చు.. మైనారిటీ కావచ్చు... మతోన్మాదం ఎప్పటికీ ప్రమాదకర మే. అన్ని రకాల మతోన్మాదాన్ని నిశితంగా వ్యతిరేకించాలి. ప్రతిఘటించాలి. లేకపోతే, బిజెపి ప్రభుత్వ విధానాలు, సంఘపరివార్ కార్యక్రమా లు లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యా యం పునాదులను పూర్తిగా ధ్వంసం చేస్తాయి. విభజనవాద, ఫాసిస్టు తరహా చర్యలు శ్రామిక ప్రజల వర్గ ఐక్యతను, దేశ సమగ్రతను దెబ్బ తీస్తుంది. ఈ ప్రమాదం నుంచి బయటపడాలం టే, ఓటర్లంతా విజ్ఞత ప్రదర్శించాలి. పరిస్థితులు గమనించాలి. వాస్తవాలు గ్రహించాలి. బిజెపిని ఓడించాలి.

డా. జి. వెన్నెల గద్దర్

## లేఖ

# టెట్ ఎంట్రెన్స్ ఫీజులు తగ్గిస్తే బాగుండు

విద్యాహక్కు (RTE) చట్టం ప్రకారం, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (NCTE) రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వం నిర్వహించే TET పరీక్షలో అభ్యర్థి ఉత్తీర్ణులు అయితేనే డిఎస్‌సి రాయడానికి అర్హుడు అనే నిబంధనల మేరకు గత ప్రభుత్వంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' నిర్వహించారు. ప్రవేశ పరీక్ష ఫీజు మాత్రం నామమాత్రంగా ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విడుదలైన మొదటి టెట్ పరీక్ష ప్రవేశ ఫీజు భారీగా పెంచారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సమగ్ర నోటిఫికేషను విద్యాశాఖ విడుదల చేసింది. పరీక్షకు కావల్సిన అర్హతలు, పరీక్ష విధానాన్ని నోటిఫికేషన్లో పేర్కొంది. అయితే ఈసారి టెట్ పరీక్షఫీజును భారీగా పెంచారు. గతంలో ఒక్కో పేపరుకు 200రూపాయలు, రెండు పేపర్లు రాస్తే 300 రూపాయలు ఫీజు ఉండేది. 2023లో జరిగిన టెట్ పరీక్షకు ఎన్ని పేపర్లు రాసిన 300రూపాయలు ఫీజు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా ఈ ఫీజును బాగా పెంచేశారు.

మే15వ తేదీనుండి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చనీ, మే 20 నుంచి జూన్ 3వ తేదీవరకు ఉదయం 9 నుంచి 11.30 వరకూ, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. టెట్ ఫలితాలను జూన్ 12వ తేదీన విడుదల చేయనున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

టిటిసి లేదా డిఎడ్ చేసిన వారు పేపర్ 1 కొరకు 1000 రూపాయల ఫీజు, బిఇడి చేసిన వారు పేపర్ 2 కొరకు 1000 రూపాయలు చెల్లించాలని, రెండు పేపర్లు రాయడానికి అర్హులైన వారు రూ.2000లు చెల్లించాలనే నిబంధన నిరుద్యోగులకు ఇబ్బంది కలిగిస్తోంది. అసలే నిరుద్యోగం, ఏదో ప్రైవేట్ పాఠశాలలో నామమాత్రపు వేతనముతో కుటుంబాన్ని పోషించుకుంటున్న వారు, మెగా డిఎస్‌సి మీద ఆశలు పెంచుకొని, కోచింగ్ సెంటర్ల వెంటపడి కష్టపడి చదువుదామని అనుకుంటున్న సమయంలో ఈ ఫీజు వారికి భారంగా తయారైంది. అసలే డిఎస్‌సి మెటీరియల్ ప్రైవేట్ ఎడిషన్ రేట్లు విపరీతంగా పెరగడం, విపరీతమైన పోటీ అయినప్పటి ప్రయత్నం చేస్తున్న నిరుద్యోగులకు, మధ్యతరగతి వారికి ఈ ఫీజు భారంగా మారింది. పవేశ పరీక్షల రుసుములు గతంలో కంటే తగ్గుతాయని భావించిన నిరుద్యోగులు నోటిఫికేషన్ చూసి నిరాశ చెందారు. అధిక ఫీజులు లేకుండా పోటీపరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని ఇప్పుడు పెద్దమొత్తంలో ఫీజులు నిర్ణయించినందున నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని ఫీజును తగ్గించాలని, గతంలో లాగే 300 రూపాయలు ఉంటే బాగుండునని నిరుద్యోగులు ఆశిస్తున్నారు. నిరుద్యోగుల కోరిక మేరకు ఫీజును తగ్గిస్తారని ఆశిద్దాం.

గడప రఘుపతిరావు

## హోలీలో చిన్నారుల సంబరాలు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** ఎల్‌బినగర్‌లో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు హోలీ రంగులను పోసుకుంటూ పండగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు చిన్నారులు ఒకరినొకరు పోలి రంగులు పూసుకుంటూ హ్యాపీ హోలీ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఆల్ప్రాజోలం పట్టివేత



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న ఆల్ప్రాజోలంను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కొత్తూరు శివారులో విజయలక్ష్మీ వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.13లక్షల విలువ చేసే ఆల్ప్రాజోలం ముతాను ఎస్‌ఓటి పోలీసులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెలికిచర్ల అనిల్ గౌడ్ (32), మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన సుధాకర్ (42), నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం నేరళ్ల పల్లికి చెందిన శరత్‌బాబు (30)ల నుండి ఆల్ప్రాజోలంతో పాటు మూడు సెల్‌ఫోన్లను, ఒక కారును స్వాధీనం చేసుకొని ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

## హోలీ పండుగ ప్రజలందరి జీవితాలలో సంతోషాన్ని నింపాలి

ఎల్‌బినగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్బీనగర్:** హోలీ పండుగ సందర్భంగా ఎంఎల్‌ఎ దేవి రెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ మల్కాజ్‌గిరి ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యజీవితంలో కష్టాలను కాసేపు మరిచి మరిచి, వయో బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి కేరింతలతో ఆనందోత్సహాల నడుమ రంగులతో జరుపుకునే ప్రకృతి పండగ హోలీ అని వారు అన్నారు హోలీ పండుగ భారతీయ సామాజిక సంృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని, వసంతాన్ని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తూ జరుపుకునే హోలీ పర్వదిన సందర్భంగా ఆ పకృతి మాత ప్రజలందరినీ చల్లగా చూడాలని వారు అన్నారు పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకుని హోలీ పండుగ స్వాగతం పలుకుతుందని ప్రజలందరూ మోదుగుల వంటి సహజ సిద్ధమైన రంగులతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని వారు కోరారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక....



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చెడుపై మంచి సాధించిన విజయాలనికి ప్రతీకగా హోలీ పండుగను జరుపుకుంటారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంతోపాటు కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో హోలీ సంబరాలు అంబరానంటే విధంగా నిర్వహించారు. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ఎంతో ఆనందోత్సవాల మధ్య హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ నృత్యాలు చేస్తూ సంతోషంగా జరుపుకున్నారు. మన జీవితాల్లో సంతోషాన్ని వికసించే వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ రంగుల హోలీ అందరికి ఆనందాన్ని పంచాలని కోరుకుంటూ భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని భగవంతుడిని వేడుకున్నారు. అదే విధంగా చిన్నారులు ఎంతో ఆనందోత్సవాల మధ్య హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. ఏడాది అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో చిన్నారులు హోలీ సంబరాలు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, న్యాయవాదులు చెంది మహేందర్‌రెడ్డి, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నందీశ్వర్, డాక్టర్ రాజ్‌కుమార్, జర్నలిస్టు వేణు, బాల్‌రెడ్డి, మురళీ, గంధం సురేందర్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

### హిందూ సంస్కృతిలో ప్రత్యేకమైన పండుగ హోలీ

హిందూ సంస్కృతిలో ప్రత్యేకమైన పండుగ హోలీ అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని వివిధ కాలనీల్లో బిజెపి నేతలు హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ మాసంలో ప్రకృతిలో మార్పులు వస్తాయని, చిన్న పెద్ద అనే బేదం లేకుండా ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగని, హిందూ సంస్కృతిలో ఉనికి ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. ఈ హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపడంతోపాటు సుఖ సంతోషాలతో పాడి పంటలతో కళకళలాడుతూ ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అందె బాబయ్య, పాతపల్లి కృష్ణారెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, మల్చలం మురళి, ప్యాట అశోక్, హరి భూషణ్‌లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ఉత్సవాలు

**ప్రజాపక్షం/ నార్సింగి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలలో ఘనంగా హోలీ పండుగ ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం హోలీ అందరికీ ఇష్టమైన పండుగ సంబరాలలో నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉషారాణితో పాటు మున్సిపాలిటీలో ఉన్న పెద్దలు చిన్నలతో సంతోషంగా రంగులు పోసుకుంటూ కనిపించిన ఉషారాణి మణికొండ మున్సిపాలిటీలో నాయకులు కార్యకర్తలు ఉత్సవాలలో పెద్దలు పిల్లలు రంగులు వేసుకుంటూ ఉత్సవాలు పాల్గొన్నారు. ఈ పండుగలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి రంగులు పోసుకుంటూ సంతోషంగా ఒకరికొకరు రంగులు రుద్దుకుంటూ ఆటపాటలతో ఆనందంలో హోలీ సంబరాల్లో మునిగిపోయారు కొన్ని ప్రాంతాల్లో కోడిగుడ్లు టమాటాలతో కొట్టుకుంటూ ఆనందంలో మునిగిపోయారు డిజె సౌండ్‌లను పెట్టుకుని సంతోషంగా డప్పులతో ఊరేగింపు చేస్తూ తిరుగుతూ రంగు నీళ్ళు పోసుకుంటూ జరుపుకోవడం జరిగింది.



# అడవుల్లో అగ్ని ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలి

అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అడవుల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి మొదలైనప్పటి నుంచి వరుసగా జరుగుతున్న ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ వద్ద ఉన్న అటవీ అగ్ని ప్రమాద నివారణ యంత్రాలపై మంత్రి అధికారులతో ఆరా తీశారు. ప్రస్తుతం అటవీ అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఉన్న ఎక్విప్‌మెంట్ ఎలా ఉంది, వీలైనంతగా ప్రమాదాలను అరికట్టడానికి మరింతగా ఏం చేయాలన్న ప్రతిపాదనలపై మంత్రి ఫోన్ ద్వారా అధికారులతో ఆదివారం చర్చించారు. పిసిసిఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో అటవీ ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని మంత్రి తెలిపారు. అటవీ ప్రమాదాల వల్ల వన్య ప్రాణులతో పాటు విలువైన అటవీ సంపదకు ఎక్కువగా నష్టం జరిగే అవకాశం ఉన్నందున అటవీశాఖతో పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని అన్నారు. అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదన్నారు. అటవీ ప్రాంతాల గుండా ప్రయాణం చేసేవారు కూడా అప్రమత్తంగా ఉండాలని, వేసవిలో అడవుల్లో వంట చేయడం, సిగరెట్, బిడి పీక లాంటివి పడేయడం చేయవద్దని మంత్రి కోరారు. మానవ నిర్లక్ష్యం వల్లే అటవీ అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నందువల్ల తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాల రిపోర్టు అందగానే క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను అప్రమత్తం చేసి, వీలైనంత త్వరగా ప్రమాద ప్రాంతాలకు చేరి, అగ్గిని నివారించే చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం స్థానికుల సహకారం కూడా కోరాలని మంత్రి అధికారులకు సూచించారు.

## టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ అధ్యక్షుడు పి. సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన ఘనత తెలుగుదేశానికే దక్కుతుందని పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలంలో సోమవారం సాయిబాబా మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్‌లో విజయవంతం చేయాలని సాయిబాబా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తమ తమ నియోజకవర్గాలు, డివిజన్‌లలో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. అనంతరం సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు 1982 మార్చి 29వ తేదీన హైదరాబాద్ ఆదర్శ్ నగర్ ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో తెలుగు దేశం జెండా ఎగురవేసి, పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. అప్పటి వరకు రాజకీయ అవకాశాలకు దూరంగా ఉన్న బడుగు, బలహీనవర్గాలకు తెలుగుదేశం పార్టీని వేదికగా అవకాశం కల్పించారన్నారు. మార్చి 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఆనవాయితీని కొనసాగింపుగా పార్టీ శ్రేణులందరూ తమ నియోజకవర్గ, డివిజన్‌లలో నిర్వహించాలని సాయిబాబా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ లోక్‌సభ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, యాదగిరి రావు, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో నేరం అంగీకరించిన నిందితులు!

నేడు కస్టడీకి కోరనున్న పోలీసులు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం పోలీసులు కస్టడీ పిటిషన్‌ను వేయనున్నారు. కేసులో ఎ2, ఎ3లుగా ఉన్న ఇద్దరు అదనపు ఎస్‌పిలు భుజంగ రావు, తిరుపతన్న, ఎ1గా ఉన్న ప్రణీత్ రావును కస్టడీ ఇవ్వాలని కోర్టును కోరనున్నారు. కస్టడీలో భాగంగా ముగ్గురినీ కలిపి విచారించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న భుజంగ రావు, తిరుపతన్న తాము ఫోన్ ట్యాపింగ్ చేశామని అంగీకరించినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారి ఆదేశాల మేరకే తాము పని చేశామని, ప్రణీత్‌రావుతో కలిసి ఆధారాలు ధ్వంసం చేశామని వారు అంగీకరించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం మేరకు నాగోలు మూసీ వంతెన కింద హార్డ్‌డిస్క్‌ల భాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించారు. మరోవైపు విచారణ సమయంలో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు, రాధాకిషన్ పేర్లను నిందితులు వెల్లడించారని పోలీసులు తెలిపారు. వారిని కూడా విచారించాల్సి ఉన్నందున, వారిపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. తొలుత ఎస్‌ఐబిలో ఆధారాల ధ్వంసం కేసులో అరెస్టయిన ప్రణీత్‌రావును విచారిస్తున్న క్రమంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇదంతా అప్పటి ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే సాగినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు ప్రణీత్‌రావు వాంగ్మూలంలో వెల్లడించాడు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకొని ట్యాపింగ్‌లకు పాల్పడినట్లు గుర్తించారు. భుజంగరావు ఎన్నికల ముందు వరకు పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో, తిరుపతన్న ఎస్‌ఐబిలో అదనపు ఎస్‌పిలుగా విధులు నిర్వర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు, ఐ న్యూస్ మీడియా నిర్వాహకుడు శ్రవణ్‌రావు అరువెల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురూ ఇప్పటికే దేశం దాటినట్లు వెల్లడి కావడంతో లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు.

### ట్యాపింగ్ కుతంత్రంపై సమగ్ర విచారణ జరపాలి : నిరంజన్

గత ప్రభుత్వ హయాంలో ఉన్నతస్థాయిలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కుతంత్రంపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. దోషులకు కఠిన శిక్ష విధించాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచ్ అధికారుల ద్వారా జరిగిన ఫోన్ టాపింగ్ వ్యవహారం సస్పెండ్ అయిన డిఎస్‌పి ప్రణీత్ రావు వెల్లడించిన వివరాల ఆధారంగా మాజీ ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్‌రావుతో సహా ముగ్గురిపై ఎల్‌ఓసి జారీ చేయడం, అదనపు డిసిపి స్థాయి అధికారులను అరెస్టు చేయడం సంచలనం సృష్టించిందన్నారు. ఇంత జరుగుతున్నా అప్పట్లో ఉన్న డిజిపి స్థాయి అధికారులు ఎందుకు కనిపెట్ట లేక పోయారు? ఇదంతా వారికి తెలిసే జరిగిందా? అని ప్రశ్నించారు.ప్రత్యర్థి పార్టీలను దొంగ దెబ్బ తీయడానికి ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన జెడ్‌పిటిసి సభ్యురాలు ఎదిర రాగమ్మ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొందుర్గు జెడ్‌పిటిసి సభ్యురాలు ఎదిర రాగమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరింది. వారం రోజుల్లోనే ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో తిరిగి సొంత గూటికి జెడ్‌పిటిసి సభ్యురాలు ఎదిర రాగమ్మ మాజీ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరింది. దాంతో గులాబీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, విధివిధానాలు నచ్చకనే బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వివరించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుండి తనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, ఆ పార్టీ విధానాలు సరిగ్గా లేవని, దాంతో తీవ్ర మనస్థాపానికి గురై బిఆర్ఎస్‌కు వచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో ఎవరికి వారే యమునాతీరు అన్న చందంగా వ్యవహరిస్తున్నారని, అందుకే బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు. తనతోపాటు మరికొంతమంది బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎంఎల్‌సి, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండల కాకునూరు గ్రామంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కరికె సురేష్ అనే వ్యక్తి వాగులోంచి తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలించి బయటకు తరలిస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న ఏఎస్ఐ నర్సింలు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఎస్ఐ నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు ట్రాక్టర్ యజమాని సురేష్, డ్రైవర్ ఢిల్లీ రాములులపై నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వేగంగా పెరుగుతున్న కాలేయ వ్యాధులు

'బ్రిడ్జ్ ది గ్యాప్స్-లివర్' సదస్సులో గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుల ఆందోళన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ భారతదేశంలో నిత్యం కాలేయ వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది జీవితాలపై కాలేయ వ్యాధులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వైరల్ హెపటైటిస్, ఫ్యాటీ లివర్, లివర్ ఫైబ్రోసిస్, లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌ల వరకు అనేక రకాల కారణాలను విస్తరిస్తోందని గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య నిపుణులు హెచ్చరించారు. 'బ్రిడ్జ్ ది గ్యాప్స్ లివర్' అధ్యాయం హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించింది. యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి సదస్సును ప్రారంభిస్తూ కాలేయ వ్యాధులు భారతదేశంలో ఒక అంటువ్యాధిగా వేగంగా వ్యాప్తి చెందుతోందని, ప్రతి ఐదుగురు పెద్దలలో ఒకరు దీని బారిన పడుతున్నారన్నారు. కాలేయ వ్యాధులు గణనీయమైన ఆరోగ్య భారాన్ని కలిగి ఉన్నందున, ఈ సమావేశంలో ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్ వంటి ముఖ్యమైన ఆరోగ్య సమస్యలను ఈ సమావేశంలో ప్రస్తావించారు. ప్యానెలిస్ట్ లు, ప్రెజెంటర్‌లు హెపటైటిస్‌కి సంబంధించిన విభిన్న విధానాల గురించి వివరంగా చర్చించారు. మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం వైద్యుల బృందం డాక్టర్ నవీన్ పోలవరపు, డాక్టర్ సంతోష్ ఎనగంటి, కె.ఎస్.సోమశేఖర్‌రావు, డాక్టర్ గోపి శ్రీకాంత్, డాక్టర్ శరత్‌చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా షాద్‌నగర్ ఎంఎల్‌సి రాజకీయాలు

ఏ పార్టీలోకి ఎవరు ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితులు

ప్రజాప్రతినిధులను కాపాడుకునేందుకు తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ

ఎంఎల్‌సి ఎన్నికలకు ఇక మూడు రోజులే గడువు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికలు షాద్‌నగర్‌లో రసవత్తరంగా మారుతున్నాయి. ప్రజా ప్రతినిధులు ఎప్పుడు ఏ పార్టీ మారుతారో తెలియక వారిని కంటికి రెప్పాలా కాపాడుకునేందుకు అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతోపాటు రెండు మున్సిపాలిటిలు ఉన్నాయి. షాద్‌నగర్ మున్సిపాలిటిలో మొత్తం 28వార్డులకు గాను 23వార్డులను బిఆర్ఎస్ కైవసం చేసుకోగా రెండు వార్డులకు కాంగ్రెస్, ఇండిపెండెంట్ కౌన్సిలర్లుగా ముగ్గురు ఉన్నారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ఇండిపెండెట్‌గా గెలిచిన ఇద్దరు కౌన్సిలర్లు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఒకరు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరో ఇండిపెండెంట్ కౌన్సిలర్ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి శిబిరంలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన ఒక కౌన్సిలర్ శాసన సభ ఎన్నికల ముందు బిఆర్ఎస్‌లో చేరారు. అదే విధంగా కొత్తూరు మున్సిపాలిటిలో మొత్తం వార్డులు 12 ఉండగా బిఆర్ఎస్ పార్టీకి 7వార్డులు, కాంగ్రెస్ పార్టీకి 5 వార్డులు వచ్చాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్లు బిఆర్ఎస్‌లో చేరారు. దాంతో రెండు మున్సిపాలిటిల్లో ప్రతిపక్ష పార్టీ అయిన బిఆర్ఎస్‌కే ఎక్కువ మెజార్టీ ఉందని చెప్పవచ్చు. నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలంలో మొత్తం 17ఎంపిటిసి స్థానాలకు 9ఎంపిటిసి స్థానాలు బిఆర్ఎస్ కైవసం చేసుకోగా 6ఎంపిటిసి స్థానాలు కాంగ్రెస్ దక్కించుకుంది. ఇండిపెండెట్‌గా ఉన్న ఇద్దరు ఎంపిటిసి సభ్యులు చేరో పార్టీలో చేరారు. కొత్తూరు మండలంలో మొత్తం 10ఎంపిటిసి స్థానాలు ఉండగా బిఆర్ఎస్‌కు 5స్థానాలు, కాంగ్రెస్‌కు 4స్థానాలు, బిజెపికి ఒక స్థానం చొప్పున దక్కించుకున్నాయి. నందిగామ మండలంలో మొత్తం 9ఎంపిటిసి స్థానాలు ఉండగా 6స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోగా 3స్థానాలను బిఆర్ఎస్ దక్కించుకుంది. ఎన్నికల ముండి బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో ముగ్గురు ఎంపిటిసి సభ్యులు చేరారు. దీంతో కాంగ్రెస్‌కు నందిగామ మండలంలో బలం ఒక్కసారిగా పెరిగిపోయింది. కేశంపేట మండలంలో మొత్తం 10ఎంపిటిసి స్థానాలకు 6ఎంపిటిసి స్థానాలను బిఆర్ఎస్ దక్కించుకోగా కాంగ్రెస్ పార్టీ 4ఎంపిటిసి స్థానాలను దక్కించుకుంది. చౌదరిగూడ మండలంలో మొత్తం 9ఎంపిటిసి స్థానాలకు గాను 5కాంగ్రెస్, 4బిఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. మండలంలో ఇటీవల కాలంలో ఒక ఎంపిటిసి చనిపోయారు. కొందుర్గు మండలంలో 9ఎంపిటిసి స్థానాలకు 5ఎంపిటిసిలు బిఆర్ఎస్, 3 ఎంపిటిసి కాంగ్రెస్, ఒకరు ఇండిపెండెంట్‌గా ఉన్నారు. ఆరు మంది జడ్పిటిసిలు బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉండగా శాసన సభ ఎన్నికల సమయంలో మాత్రం ఇద్దరు జెడ్‌పిటిసిలు కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ కంటే ప్రతిపక్ష పార్టీకే ఎక్కువ ఓట్లు ఉన్నాయని చెప్పవచ్చు. ప్రజాప్రతినిధులను కాపాడుకునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ముమ్మరంగా యత్నించడంతోపాటు క్యాంపు రాజకీయాలకు తెర తీశారు. దాంతో ఇరు పార్టీల ప్రజాప్రతినిధులను కుటుంబ సభ్యులతో సహా గోవాకు తరలించారు. శాసన మండలి ఎన్నికలకు ఇక మూడు రోజులే గడువు ఉండటంతో ఎంపిటిసిలు, కౌన్సిలర్లు పక్కచూపులు చూడకుండా ఉండేందుకు స్థానిక నేతలు పకడ్బంధీ గా చర్యలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికి ఎంఎల్‌సి ఉప ఎన్నికలు మాత్రం రసవత్తరంగా సాగుతున్నాయి.

## నిత్యావసర సరుకులు అందజేత



**ప్రజాపక్షం/బోడుప్పల్‌:** విధి వంచితులై అమ్మా నాన్నలను కోల్పోయిన అనాధ పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టడం ఆధ్మాత్మిక సేవతో సమానమని దత్తి సత్యనారాయణ అన్నారు. ఆయన నడుపుతున్న దత్తి సత్యనారాయణ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శ్రద్ధ అనాధ ఆశ్రమంలో నిత్యావసర సరుకులను ఆశ్రమ ఫౌండర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం తరఫున దత్తి సత్యనారాయణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దత్తి సత్య శ్రీసుధా, లిఖిత, రుద్ర, స్వచ్ఛంద వాలంటీర్లు ప్రవీణ్ రాచర్ల, గిరి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా మల్కాజ్‌గిరి గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ చౌరస్తాలో శ్రీ ధర్మశాస్త్ర సేవా సమాజం ఆధ్వర్యంలో జంగాల శ్రీరామ్ యాదవ్, శ్రీధర్మశాస్త్ర సేవా సమాజం సభ్యులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఉదారి సత్యనారాయణ యాదవ్, కుమ్మరి రాజు, సక్కురి భాస్కరరావు, రవికుమార్, వెంకటేష్, విగ్నేష్ గౌడ్, గోల్డ్ శీను, రవికుమార్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, సురేష్, శ్రీధర్, జనగే అశోక్, అప్పాల శ్రీనివాస్, మధు గౌడ్, నాగరాజ్‌తో పాటు మానవసేవే మాధవసేవ ప్రతినిధులు కృష్ణ, మహేష్, జగన్, సతీష్ పాల్గొన్నారు.

## తైక్వాండో విజేతలకు అభినందన




**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి :** మల్కాజ్‌గిరి తైక్వాండో అకాడమి చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా ఆరు గోల్డ్ మెడల్స్, రెండవ బహుమతిగా మూడు సిల్వర్ మెడల్స్, ఎనిమిది కాపర్ మెడల్స్‌ను విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ అధ్యక్షుడు పిఎన్ శ్రీనివాస్ విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. విద్యార్థులు ఆసక్తికరంగా పాల్గొని సందడి చేశారు. అంబేద్కర్ భవన్ కార్యవర్గ సభ్యులు ఎలిమెల జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, మద్దెల సుధాకర్, గంగాధరి కృష్ణ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బడుగు, బలహీనవర్గాల గొంతుక జ్ఞానేశ్వర్ విజయం ఖాయం



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** 96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరిని ఒక్కతాటికి తీసుకువచ్చి,వారి ఐక్యతకు పాటుపడ్డ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని అక్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తలారి అజయ్ కుమార్ అన్నారు. అయన ఈ సందర్బంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోతే ప్రస్తుత ఎంపీ కష్టకాలంలో పార్టీని వదిలి వెళ్లాడన్నారు. ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్ రెడ్డిని ఎంపీగా గెలిపించుకున్నామని, రెండుసార్లు బిఆర్ఎస్ కారు గుర్తుతో గెలిచిన వారు ఇప్పుడు మనకు ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారన్నారు. ప్రజలతో మమేకం అయిన ఒక మంచి వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్ అని, జడ్పీ చైర్మన్ గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి సేవ చేశారని, బడుగు బలహీన వర్గాల గొంతుకగా జ్ఞానేశ్వర్ వాణి పార్లమెంట్‌లో వినిపించేలా మండల ప్రజలు కృషి చేద్దామని అజయ్ కుమార్ కోరారు.

## బిఆర్ఎస్ మండల అధ్యక్షుడిపై హత్యాయత్నం




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కమల్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం గ్రామ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామానికి చెందిన కొత్తగడి నాగిరెడ్డి భార్య లలిత మధ్య గొడవ రాగా లలిత బంధువుల గ్రామంలో పంచాయతీ పెట్టారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డిని గ్రామపెద్దగా మందలించడం , అదే సమయంలో నాగిరెడ్డిపై లలిత బంధువులు దాడి చేయడం తో కింద పడి చేయి విరిగింది. దీంతో కోపం పెంచుకున్న నాగిరెడ్డి ఎలాగైనా కమల్ రెడ్డిని చంపుతానని గ్రామంలో చెప్పుకోని తిరిగేవాడు. అదును కోసం ఎదురు చూసి హోలీ సందర్భంగా కమల్‌రెడ్డి గ్రామనికి వెళ్లగా హోలీ అదే క్రమంలో కత్తితో దాడి చేశాడు. దాడిలో కమల్‌రెడ్డి చేతికి, మెడ భాగంలో తీవ్ర గాయాలై ప్రాణాలతో బయట పడ్డరు. గ్రామస్తులు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. దాడి సమాచారం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే అనంద్ ఆసుపత్రికి కమల్ రెడ్డి అరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## పెన్షన్ ఉత్పత్తిలో పెట్టుబడి పెట్టడానికి సరైన సమయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశంలో వడ్డీ రేట్లు ప్రస్తుత స్థాయిల నుండి రానున్న కొద్ది నెలల్లో తగ్గుతాయని పలువురు మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కస్టమర్‌లకు ప్రస్తుత 7 శాతం వడ్డీ రేటు, యాన్యుటీ ప్రోడక్ట్‌లో తమ పెట్టుబడిని లాక్‌ఇన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పుడు యాన్యుటీ ప్రోడక్ట్‌లో ఇన్వెస్ట్ చేయడం కస్టమర్‌లకు ఎలా ప్రయోజనం చేకూరుస్తుంది. ఐసిఐసిఐ ప్రూ గ్యారెంటీడ్ పెన్షన్ ప్లాన్ ఫ్లెక్సీ యాన్యుటీ ఉత్పత్తులలో ప్రత్యేకంగా నిలుస్తుందని, ఇది క్రమబద్ధమైన పెట్టుబడులు చేయడం ద్వారా రిటైర్‌మెంట్ ఫండ్‌ను నిర్మించడంలో వినియోగదారులకు సహాయపడుతుందని ఐసిఐసిఐ ఒక ప్రకటనలో వివరించింది. ఇది పదవీ విరమణ తర్వాత ఖచ్చితంగా, స్థిరమైన ఆదాయాన్ని నిర్ధారిస్తుందని తెలియజేసింది. పదవీ విరమణ పొందినవారు వడ్డీ రేటు ఒడిదుడుకుల వల్ల ప్రభావితం కాని స్థిరమైన ఆదాయాన్ని ఇష్టపడతారని, వార్షిక లేదా పెన్షన్ ఉత్పత్తులు ఉత్తమ ఎంపిక, ఇవి ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటానికి సాధారణ ఆదాయాన్ని అందిస్తాయని తెలిపింది.

## గుండె సంరక్షణకు ‘లీ హెల్త్ లైఫోస్టెరాల్’




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూట్రాసూటికల్స్ తయారీలో భారత్‌లో అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన హైదరాబాద్ కంపెనీ ‘లీ హెల్త్ డొమెయిన్’ గుండె సంరక్షణ కోసం సహజసిద్ధ ఔషధ మూలికలతో ‘లైఫోస్టెరాల్’ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌ను రూపొందించింది. ఇందులో వెల్లుల్లి సారం, గామా ఒరిజనోల్, ఫైటోస్టెరాల్, లైకోపీన్, పసుపులో ఉండే కుర్కుమిన్, మెంతికూర, నల్ల మిరియాల నుంచి తీసిన పైపెరిన్ సమ్మేళనాలను జోడించారు. హృదయ సంబంధ వ్యాధులలో విస్తృత పరిశోధన తర్వాత లైఫోస్టెరాల్‌కు రూపకల్పన చేసినట్టు లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ‘లైఫోస్టెరాల్ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను సమతుల్యం చేయడానికి, క్రమ రహిత హృదయ స్పందనల స్థిరీకరణ కోసం ధమనులలో మృదువైన ఫలకాన్ని తొలగించడానికి అవసరమైన నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. ఫ్రీరాడికల్స్ నుండి శరీరాన్ని రక్షిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి’ అని లీలారాణి వివరించారు. ఆన్‌లైన్‌లో అమెజాన్, లీ హెల్త్ డొమెయిన్ పోర్టల్‌లో, ప్రముఖ ఫార్మసీలలో లైఫోస్టెరాల్ లభిస్తుందని తెలిపారు.

# జోరుగా రంగుల పండుగ సంబరాలు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలోని ఎనిమిది డివిజన్‌లలోని ప్రజలు సంతోషంగా హోలీ పండుగను జరుపుకున్నారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఒకరి పై మరొకరు రంగులను జల్లుకుని హోలీ శుంభాకాంక్షలను తెలిపారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా హోలీ ఈవెంట్‌లను నిర్వహించారు. ఈ ఈవెంట్‌లలో తెలుపు రంగు దుస్తువులను ధరించి ఎంతో హుషారుగా నృత్యాలు, సంగీతాలు, పాటలతో హోలి సంబరాలను హోరెత్తించారు. పలువురు ప్రముఖ సినీ గేయకులు విచ్చేసి ఆకర్షణీయమైన పాటలతో చూపరులను ఉర్రూతలూగించారు. జీడిమెట్లలోని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద నివాసంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. జిహెచ్ఎంసీ కార్మికులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే కెపి వివేక్‌కు రంగులను చల్లి శుభాకాంక్షలను తెలిపారు. వివేక్ సైతం వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలను తెలియజేశారు. నిజాంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ



కుడు కొలను శ్రీనివాస్ రెడ్డి నివాసంలో హోలి సంబరాలను ఆనందంగా నిర్వహించారు. కార్పొరేషన్ కార్మికులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి కొలను శ్రీనివాస్ రెడ్డి పై రంగులను చల్లి హోలి శుభాకాంక్షలను తెలిపారు. వారితో కలిసి కొలను శ్రీనివాస్ రెడ్డి సైతం రంగులను చల్లుతూ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా వివేక్, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ పండుగలను కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ప్రజలంతా కలిసి జరుపుకునే పండుగ హోలీ అన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా పండుగలను కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు.

### రంగురంగులతో ప్రజల జీవితం ఆనందంగా ఉండాలి

**మల్కాజ్‌గిరి:** ప్రజలు తమ జీవితంలో అన్ని రంగులతో కలిసి ఆనందంగా ఉండాలని మౌలాలీ డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా మౌలాలీ కార్పొరేటర్ నివాసంలో హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి హోలీ వేడుకల్లో కార్పొరేటర్ దంపతులు సునీత, చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

**కోట్‌పల్లి :** కోట్‌పల్లి మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి కామ దహనం అనంతరం సోమవారం ఉదయం నుండి చిన్నారులు, పెద్దలు కలిసి కట్టుగా హోలీ సంబురాలను నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం నుండి అన్ని గ్రామాల్లో కాలనీల్లో డప్పు వాయిధ్యాలతో అందరు కలిసిమేలసి ఒకరిపై ఒకరు రంగులను వేసుకుంటు సంతోషాలను హోలీ సంబురాలను నిర్వహించుకుంటున్నారు. మల్‌శేట్‌పల్లి తండాలో మాత్రం ఈ సారి అద్భుతంగా నిర్వహించుకున్నారు. లంబాడీల దుస్తులతో డప్పుల దరువుతో లంబడీల సంప్రదాయాలతో ఆటపాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ నాయక్, రాములు, రమేష్ నాయక్ తదితరులున్నారు.

**బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలో కూల మతాలకు అతీతంగా హోలీ పండగా ఘనంగా ప్రజలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బాగంగా హోలీ సందర్బంగా రంగు రంగుల కలర్స్ తో ఒకరిపై ఒకరు రంగులు పూసుకోని ప్రేమ పూర్వకంగా కనుల విందుగా పండగను జరుపుకుంటారు. ఒక రోజు ముందు రాక్షస రాజు హిరణ్యకశపుడి కుమారుడు ప్రహ్లాదుడు నిత్యం విష్ణు మూర్తిని స్మరిసుంటే, హిరణకుడికి అది నచ్చదు దాంతో తో ప్రహ్లాదుడిని మట్టుపెట్టాలని నిర్ణయించుకుంటాడు. దాంతో రాక్షస సోదరి హోళికను పిలుస్తాడు. అమెకు ఉన్న శక్తితో ప్రహ్లాదుడిని మంటలో అహుతి చెయ్యాలని కోరుతాడు. దాంతో అమె ప్రహ్లాదుడిని ఒడిడిలో కుర్చోబెట్టుకోని మంటల్లోకి దుకుతుంది. అయితే విష్ణు మాయతో ప్రహ్లాదుడిడు ప్రాణాలతో భయటపడగా, హోళిక రాక్షసి మాత్రం ఆ మంటల్లో చనిపోతుంది. హోళిక దహనమైన రోజునే హోలీ పండగను నిర్వహించుకుంటారని పురణ కథలు చేబుతున్నాయి. హోలీ పండగను, హోలీ, కమినిపున్నమ, డీడోలికోత్సవం, తదితర పేర్లతో పిలుస్తారు.

**కొడంగల్ :** హరివిల్లులో ఉన్న రంగులను నేలకు దించే కలర్ ఫుల్ పండుగ హోలీ పండుగ. ఈపండుగను పురస్కరించుకుని కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా ఘనంగా జరుపుకున్నారు. పాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున హోలీ కాముని పున్నమిని ప్రత్యేకంగా జరుపుకుంటారు. చిన్నారులు యువతీ యువకులు ఉత్సహంగా పాల్గోన్నారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కొడంగల్ పట్టణంలోని వడ్డర్‌గల్లీ, కార్గీల్‌కాలనీ, ఇందిరానగర్, సన్‌సిటీ కాలనీ, బాలాజీనగర్, ఆర్యానగర్, గాంధీనగర్, లహోటి కాలనీలతో పాటు మండల పరిధిలోని గ్రామాలలో రాత్రి వేళల్లో కాముడిని దగ్ధం చేసి సోమ



వారం ఉదయం నుంచే చిన్న పెద్ద తేడాలు లేకుండా ప్రతి ఒక్కరు స్నేహభావంతో పరస్పరం రంగులు చల్లు



కుంటు సంబరాలు చేసుకున్నారు. వడ్డర్‌గల్లీలో మహిళలు డిజే పాటలతో అలరిస్తూ పలువురిని ఆకట్టుకునే విధంగా నృత్యాలు చేశారు.







# అస్తవ్యస్తంగా పారిశుధ్యం

### పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం
### ఎక్కడపడితే అక్కడ చెత్త పారబోత
### రోడ్లపై పారుతున్న మురుగు నీరు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపలిటీలో పాలన పడకేసింది. కౌన్సిలర్లు , చైర్‌పర్సన్లు ఒకరితో ఒకరు పంచాయతీ పెట్టుకోవడం తప్పా పాలనపై దృష్టి సారించడం లేదు . పురపాలకు సంఘాల పరిధిలోని చాలా కాలనీలు దుర్గంధంతో నిండిపోయి నివాసాల మధ్య మురుగు పేరుకుపోయాయి. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలకు అవాసాలుగా మారుతున్నాయి. పరిస్థితి దారుణంగా ఉన్న ప్రజా ప్రతినిధులు ,అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నయి. కాలనీల్లో ఇళ్లమధ్య , రోడ్లపైన మురుగు పేరుకు పోతున్నా పట్టించుకునే నాధులు లేకుండా పోయారు. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు , నివాసల మధ్య మురుగు నిల్వ ఉండటమే కాకుండా రోడ్లపై పారుతోంది. పట్టణాల్లో పారిశుధ్య సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. వేసవిలో ఈ సమస్య తగ్గాల్సి ఉండగా మరింత ఎక్కువ అవుతుంది. పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ కొంత మెరుగు పడినా, పట్టణాల్లో మాత్రం అధ్వానంగానే కనిపిస్తోంది . తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని అధికారులు సూచిస్తున్న ఆ దిశగా చర్యలు కనిపించడంలేదు తడిపొడి చెత్తను కలిపి సేకరించి శివారు ప్రాంతం లో డంప్ చేస్తున్నారు. పట్టణ ప్రగతి పేరుతో అప్పుడప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు కార్యక్రమం ముగిసిన వెంటనే పారిశుధ్య



కార్యక్రమాలను గాలికొదిలేస్తున్నారు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారవుతోంది. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ , తాండూర్ , పరిగి ,కొడంగల్ మున్సిపాలిటీలు ఉండగా చెత్త సేకరణలో మా త్రం అన్నిటి పరిస్థితి ఒకేలా ఉందనేది బహిరంగ రహస్యం. అయితే అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులకు ఎలాంటి పొంతన కనిపించడం లేదు . తాండూర్ ,వికారాబాద్ ,పరిగి మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్లు ఉండేవి ఈ ప్రాంతాల్లో తయారు చేసిన ఎరువులను పట్టణ ప్రకృతి వనాల్లో ,నర్సరీల్లో వాడేవారు ప్రస్తుతం యూనిట్లను మూలకు పడేశారు. మున్సిపల్ పాలక వర్గం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## రూ.19.79 కోట్ల కొకైన్ పట్టివేత

**ముంబై:** ముంబై విమానాశ్రయంలో రూ.19.79 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. సియెర్రా లియోన్‌కు చెందిన ఓ మహిళ నుంచి 1,979 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు సోమవారం వెల్లడించారు. దీని విలువ రూ.19.79 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద మాదకద్రవ్యాలు ఉన్నాయనే పక్కా సమాచారంతో ఆదివారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆమె వద్ద ఉన్న షూ, మాయిశ్చరైజర్ బాటిల్, షాంపూ బాటిల్ అడుగు భాగంలో తెల్లటి పౌడర్ దాగి ఉన్నట్లు కనుగొన్నామని ఓ అధికారి తెలిపారు. పౌడర్‌ను పరీక్షించగా అది కొకైన్‌గా తేలిందన్నారు. మహిళను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు.

## బిజెపితో ప్రజలు విసిగిపోయారు

### ఎస్పీ నేత శివపాల్ యాదవ్

**ఇటావా :** ‘తప్పుడు, బూటకపు’ వాగ్దానాలు చేసిన బిజెపితో ప్రజలు విసిగిపోయారని, ఎస్‌పీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు శివపాల్ సింగ్ యాదవ్ సోమవారం అన్నారు. హోలీ సందర్భంగా సైఫాయ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ‘ప్రతి ఒక్కరూ బీజేపీతో విసిగిపోయారు. ద్రవ్యోల్బణం, పన్నులు, నిరుద్యోగం, అవినీతి గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బీజేపీ చేసిన వాగ్దానాలు బూటకం. ఈసారి ప్రజలు ఎస్పీ అభ్యర్థులను గెలిపిస్తారు. యూపీలో గెలిస్తే బీజేపీ తుడిచిపెట్టుకుపోతుంది’ అని తెలిపారు. మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి చెప్పారు. తన సీటు బుదౌన్ నుంచి తన కుమారుడు ఆదిత్య యాదవ్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయా అని అడగ్గా, ‘ప్రస్తుతానికి, నేను పోటీ చేస్తాను. పార్టీ ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా నేను అనుసరిస్తాను’ అని చెప్పారు. యాదవ్‌ను బుదౌన్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు.

## శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే మధ్య చివరి నిమిషంలో సర్దుబాటు చర్చలు

**ముంబయి :** మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల నిమిత్తం ప్రతిపక్ష ఎంవిఎ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాలు చర్యలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు శరద్ పవార్ సోమవారంనాడు శివసేన (యుబిటి) నాయకుడు ఉద్ధవ్ థాక్రేను కలిశారు. శివారు ముంబయిలోని ఆయన నివాసానికి వెళ్ళి సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరిపారు. పవార్ వెంట ఎన్‌సిపి (ఎస్‌పి) మహారాష్ట్రశాఖ నాయకుడు జయంత్ పాటిల్ ఉన్నారు. శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. థాక్రే ఏకాంత నివాసం మాతృశ్రీలో ఈ చర్చలు జరిగాయి. ఏప్రిల్ 19వ తేదీన మహారాష్ట్రలో మొదటి దశలో ఐదుస్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మొదటిదశలో ఐదు స్థానాలకు ఎన్నికల నామినేషన్లకు ఈనెల 27వ తేదీన గడువు ముగియనున్నది. అంటే ఇంకా రెండు రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ఉందనగా ఈ సీట్ల సర్దుబాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎంవిఎ కూటమిలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే 12 మంది అభ్యర్థులనుప్రకటించించింది. మొత్తం 48 స్థానాలు మహారాష్ట్రలో ఉన్నాయ. ఇందులో వాయువ్య ముంబయిస్థానానికి అమోల్ కీర్తికర్‌ను, సంగ్లీలో చంద్రహార్ పాటిల్‌ను, రాయ్‌గడ్‌లో అనంత్ గెటేను నిలబెడతామని శివసేన యుబిటి నాయకుడు థాక్రే ఇప్పటికే సూచనా ప్రాయంగా చెప్పారు. మొత్తం 15 లేదా16 మంది అభ్యర్థులను నిలబెడామని సంజయ్ రౌత్ కూడా చెప్పారు. మార్చి 27తో మొదటి దశకు నామినేషన్ల ప్రక్రియ గడువు ముగుస్తుంది. ఐతే ఇంతవరకూ ఐదు సీట్లకు అభ్యర్థులను ఈ పార్టీలు ప్రకటించాల్సి ఉంది.

## నోరు జారి అవకాశం కోల్పోయి...

### అభ్యర్థుల ఎంపికలో ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా బిజెపి జాగ్రత్తలు

**బెంగళూరు:** సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్న బీజేపీ... ప్రత్యర్థులకు తమ అభ్యర్థులపై విమర్శలు గుప్పించే అవకాశం కల్పించకుండా జాగ్రత్త పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇందుకోసం గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన... స్థానికంగా వ్యతిరేకత ఉన్న నాయకులను పోటీ నుంచి తప్పిస్తోంది. సీనియారిటీని కూడా లెక్కచేయడం లేదు. తాజాగా ఈ జాబితాలో అనంతకుమార్ హెగ్డే కూడా చేరారు. కర్నాటకకు చెందిన అనంతకుమార్ హెగ్డే ఉత్తర కన్నడ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా ఎన్నికవుతున్నారు. 28 ఏళ్లలో ఆరు సార్లు గెలిచిన ఆయన... వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. అలాంటి సీనియర్ నేత నోటి దురుసుతనమే ఆయన సీటుకు చేటు తెచ్చినట్లు కనిపిస్తోంది. రాజ్యాంగాన్ని మార్చాలంటే బీజేపీ 400 స్థానాల్లో గెలవాల్సి ఉంటుందని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. హెగ్డే వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర కన్నడ నుంచి అనంతకుమార్‌ను తప్పించి మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డేకు అధిష్టానం అవకాశం కల్పించింది. మరోవైపు, భోపాల్ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకుర్ కూడా ఈ తరహా పరిస్థితినే ఎదుర్కొన్నారు. బీజేపీ విడుదల చేసిన లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో ఆమెకు చోటు దక్కలేదు. ఫైర్‌బ్రాండ్‌గా పేరొందినప్పటికీ గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే అందుకు కారణం కావొచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గాడ్సేను దేశభక్తుడిగా గతంలో ఆమె అభివర్ణించడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ విషయంపై ఇటీవల ప్రజ్ఞాసింగ్ ఠాకుర్ స్పందిస్తూ తాను చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇబ్బందికి గురిచేశాయన్నారు.

## లండన్‌లో భారతీయ పిహెచ్‌డి విద్యార్థిని మృతి

**లండన్ :** రోడ్డు ప్రమాదంలో భారత్‌కు చెందిన చేష్తా కొచ్చర్ దుర్మరణం చెందారు. ‘లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్’లో ఆమె పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. గతంలో ఆమె నీతి ఆయోగ్‌కు సంబంధించిన ఓ ప్రాజెక్టు కోసం పనిచేశారు. ‘చేష్తా కొచ్చర్ నీతి ఆయోగ్‌లో ‘లైఫ్’ ప్రోగ్రాంపై పనిచేశారు. బిహేవియరల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేయడానికి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు వెళ్లారు. సైక్లింగ్ చేస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మరణించారు. చాలా తెలివైన వ్యక్తి. ధైర్యవంతురాలు. చాలా త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను’’ ని అమితాబ్ కాంత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ నెల 19న ఎల్ఎస్ఈ నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఓ ట్రక్కు ఢీకొన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆ సమయంలో ఆమె భర్త ప్రశాంత్ కొంత దూరంలోనే ఉన్నారు. వెంటనే వచ్చి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతి చెందారు. ఆమె తండ్రి లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ (రిటైర్డ్) మత దేహాన్ని తీసుకురావడానికి లండన్‌కు చేరుకున్నారు. గురుగ్రామ్‌లో నివాసముండే చేష్తా... సెప్టెంబరులోనే పీహెచ్‌డీ కోసం అక్కడికి వెళ్లారు. గతంలో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయం, అశోక యూనివర్సిటీ, పెన్సిల్వేనియా, షికాగో విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించారు. 2021–23 మధ్య నీతి ఆయోగ్ లోని నేషనల్ బిహేవియరల్ ఇన్‌సైట్స్ యూనిట్‌లో సీనియర్ సలహాదారుగా సేవలందించారు.



## బిసి సమాజ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్ నగర్ పట్టణంలోని ఎంవీఎస్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బీసీ సమాజ్ సభ్యులు ఘనంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ కులమతాల కతీతంగా, హిందూ సంస్కృతిలో జరుపుకునే ప్రత్యేకమైన పండుగ ఈ హోలీ అని ఈ మాసంలో ప్రకృతి లో మార్పులు వస్తాయని, చిన్న పెద్ద తేడా లేకుండా ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగని, హిందూ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకత ఉందని ఆయన అన్నారు. ఈ హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీనివాస్ సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ సభ్యులు రఘు, సాయి, నరసింహ, గోపాల్, ఓంప్రకాశ్, రిటైర్డ్ ఏఎస్ఐ చిన్నారెడ్డి, రిటైర్డ్ టీచర్ భగవంతు, ఎఎస్‌డబ్ల్యూఓ ఉమాపతి, సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### జడ్చర్లలో...



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో హోళీ సందర్భంగా యువకులు పెద్దలు రంగులతో హోళి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. జడ్చర్లకు చెందిన పెద్దలు హోళి సంబరాలలో భాగంగా వచ్చే వసంత రుతువు చిగురించే కొత్త ఆశలతో తమ జీవితాల్లోకి నూతనత్వాన్ని హోలి రూపంలో స్వాగతం పలికి పిల్లలు పెద్దలు అందరు కలిసి ఆటపాటలతో ఉత్తేజంగా ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో స్నేహపూర్వక భావంతో అందరు హోలి సంబరాలు జరుపుకున్నారు.



## విజయానికి ప్రతీక హోలీ

**ప్రజాపక్షం/బాలానగర్ :** చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హోలి పండుగను నిర్వహించడం జరుగుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. హోలి పండుగ బాలనగర్ మండలంలో ఘనంగా హోలి వేడుకలు నిర్వహించారు. బోడజానంపేట గ్రామంలో గ్రామస్తులందరూ ఉత్సాహంగా హోలీ సంబరంలో పాల్గొన్నారు. మన జీవితాల్లో సంతోషాన్ని వికసించే వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ రంగుల హోలి అందరికి ఆనందాన్ని పంచాలని పలువురు ఆశించారు.

## బిజెపి మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహమ్మదాబాద్ :** బిజెపి జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షులుగా విజయ్‌కుమార్ రెడ్డిని నియమించారు. బిజెపి సిద్ధాంతాల ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ , నిబంధత, క్రమశిక్షణ చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని, సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారని జిల్లా అధ్యక్షులు అన్నారు. మీ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్ని వర్గాలలో మరించి విస్తరించడానికి కృషి చేస్తారని అన్నారు.

## ఆత్మీయతను పంచుకున్న నాయకుడు



**ప్రజాపక్షం/వెల్దండ :** రాజకీయాలలో సుదీర్ఘ కాలం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు మోతిలాల్‌నాయక్ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను గుర్తుచేసుకున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి ఒక్కసారిగా ముగ్దుడై మోతిలాల్‌నాయక్ గట్టిగా పట్టుకొని మీకునేను తోడు, నాకుమీరుతోడుగా ఈప్రయాణం కొనసాగుతుందని సంబోధించారు. సోమవారం ఎంపి అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా మొదటిసారిగా డాక్టర్ మల్లురవిని వారినివాసంలో మర్యాదపూర్వకంగాకలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ ఆనాటి స్వర్గీయ పంతునాయక్‌తో కలిసి నడిచిన రాజకీయ జీవిత మూలాలను గుర్తుచేసుకుంటూ అప్పటినుండి నేటివరకు కాంగ్రెస్‌పార్టీతో పాటు నాకు వ్యక్తిగతంగా మోతిలాల్‌నాయక్ కుటుంబం అండగా నిలుస్తున్న మీరు పార్లమెంట్ ఎన్నికలలో నాగెలుపుకోసం కృషిచేయాలని కోరారు. ఈసందర్భంగా పంతునాయక్ ఉంటే ఎంతో సంతోషించేవాడని స్మరించుకున్నారు.

## తైబజార్ సంత వేలం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2024 25 సంవత్సరంవరకు తైబజార్ సంతవేలం ఈనెల 26న మంగళవారం ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంటుందని గ్రామకార్యదర్శి నాగశేషి తెలిపారు. తైబజార్ వేలంపాటలో పాల్గొనేవారు మంగళవారం ఉదయం 10గంటలవరకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందని, చెల్లించినవారే వేలంపాటలో పాల్గొనాలన్నారు. తైబజార్‌వేలం నిబంధనలు మరింత సమాచారంకోసం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## వామపక్ష విద్యార్థుల విజయం ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటిలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎబివిపిపై వామపక్ష విద్యార్థి అభ్యర్థులు ఘనవిజయంపట్ల ఎఐవైఎఫ్ హర్షం వ్యక్తంచేస్తుందని ఎఐవైఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. మోడిప్రభుత్వానికి కూడా ఇవే ఫలితాలు రావడం ఖాయమన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాలు అభ్యర్థులు విజయం సాధించడంపట్ల ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి అన్నారు.

# జీవ వైవిధ్య రక్షణ చర్యలతో భారత గిరిజనులకు పెనుముప్పు



### అరిజోనా సదస్సులో వక్తల ఆందోళన


**అరిజోనా :** జీవవైవిధ్య రక్షణ చర్యలను రెట్టింపు చేయడంతో భారత గిరిజనులకు సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి. ఒకవైపు జీవవైవిధ్యరక్షణ ఎంతో ముఖ్యమైనప్పటికీ, మరోవైపు ఈ చర్యలవల్ల అడవులతో ముడిపడిన భారతీయ అడవి బిడ్డల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. దేశంలో షెడ్యూలు తెగలు నివసించే ప్రాంతాలలో 84 శాతం మేరకు జాతీయ పార్కులు అభివృద్ధి చేయాలనే లక్ష్యనిర్దేశం గిరిజనులకు, వారి మనుగడ, సంస్కృతులకు ప్రాణాంతకంగా మారింది. అమెరికాలో ఇటీవల జరిగిన హక్కుల సదస్సులో ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ప్రపంచవ్యాప్తగా కూడా జీవ వైవిధ్యాన్ని రక్షించేందుకు పెద్ద ఎత్తున చర్యలను ఉద్ధృతం చేశారు. గతంలో తీసుకున్న ఈ చర్యలను వివిధ దేశాలలో రెట్టింపు చేసే ప్రక్రియ మొదలైంది. ఈ పూర్వరంగంలో దేశీయ ఆదివాసులకుజరిగే నష్టంపై ఒక సదస్సు అమెరికాలోని అరిజోనా విశ్వవిద్యాలయంలో మార్చి 22న జరిగింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన కున్మింగ్–మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ తీర్మానాన్ని గనుక అమలు చేస్తే, ఆలక్ష్యాల సాధనా ప్రక్రియలో ఆదివాసీలకు రక్షణ చాలా అవసరం. ప్రపంచవ్యాప్తంగా అటవీ ప్రాంతాలతో మనుగడ ముడిపడి ఉన్న ప్రజలకు రక్షణ ఇవ్వాలి. ప్రస్తుతం 16 శాతంగా ఉన్న ఈ జీవ వైవిధ్య రక్షణ ప్రాంతాలు ప్రపంచవ్యాప్తంగా 30 శాతానికి పెరుగుతాయి. భారత దేశంలో షెడ్యూల్డు తెగల జాతులు ఈ చర్యలవల్ల తీవ్రంగా నష్టపోతారు. భారత్‌లో గుర్తింపు పొందిన 106 ప్రాతాలకుగాను 89 జాతీయ పార్కుల ప్రాంతాలలో ఆదివాసీలు జీవిస్తున్నారు. అంటే దీని అర్థం 84 శాతం రక్షణ ప్రాంతం భారత్‌లో గిరిజన ఆదివాసీల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తునన హక్కుల కార్యకర్త సుహాస్ చక్మా ఈ విషయంపై అరిజోనాలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ, జీవ వైవిధ్య ప్రాంతాల రక్షణ, జాతుల మనుగడ, దేశీయ ప్రజలు, మానవ హక్కుల రక్షణ అంశాలను ప్రధానంగా ఆయన వివరించారు. ఇదే అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చలు జరిపారు. వీటిల్లో మిగిలిన 17 జాతీయ పార్కులలో ప్రధానంగా అండమాన్, నికోబార్ దీవులలో ఉన్నాయి. సౌత్ బటన్ ఐలాండ్, నేషనల్ పార్క్, రాణీ ఝాన్సీ మెరైన్ నేషనల్ పార్కులు ఈ దీవులలో ప్రధానమైనవి. మిగిలిన నాలుగు పార్కులకుగాను వన్ విహార్, కాసు బ్రహ్మానందరెడ్డి, మహవీర్ హరిన వనస్థలి, సలీమ్ అలీలు జంతు ప్రదర్శనశాలలుగా ఉన్నాయి. మిగిలినవాటిల్లో కల్నల్ షేర్‌జంగ్ సింబల్‌బర, నియోరా వ్యాలీ, సింగలిలా, ఫాస్సిల్‌లలో గిరిజనులు ఉన్నారు. మరోవైపు జనరల్ కేటగిరిలో ఉన్న ప్రజలు ఏడు జాతీయ పార్కులవల్ల నష్టపోతారు. వీరిలో గిరిజన తెగలు 8..6 శాం ఉన్నారు. ఈ రక్షణ ప్రాంతాలవల్ల 84 శాతం ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీనివల్ల వారి జీవన విధానం, రోజువారీ జీవన అన్వేషణ దుర్భరంగా మారుతుందని సదస్సులో చక్మ ఆందోళన వ్యక్తం చేశారు. వసలవాద పాలకుల కాలం నుండీ వారి జీవన విధానాన్ని నేరపూరితంగా చూశారని, 1927 నాటి అటవీచట్టాలను వారిపై రుద్ది వారిని సమస్యల్లోకి నెట్టారనీ ఆయన అన్నారు. ఈ విధంగా ఆదివాసీలపట్ల అనుసరించిన విధానాలవల్ల అనేక వేల కేసులు నమోదయ్యాయి. షెడ్యూల్డు తెగలు, గిరిజనులు, ఆవాసీలపై దాఖలైన 48,000 కుపైగా కేసులను గడచిన ఫిబ్రవరిలో ఒడిశా ప్రభుత్వం ఉపసంహరించుకోవడం చూస్తే వారిపై ఎన్ని అఘాయిత్యాలు జరిగాయో, ఎంత నేరస్తులుగా వారిని చూశారో కళ్ళెదుట కనిపిస్తోందన్నారు. ఆదివాసీలపై దాడులు, భూ ఆక్రమణలు, మద్య దాడ్లు కేసులు అత్యధికంగా నమోదు చేశారన్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లోని వన్యమృగ సంరక్షణ ప్రాంతం కుంభల్‌గర్ లేదా మధ్యప్రదేశ్‌లోని నౌరదేహి సంరక్షణ కేంద్రం ప్రధానంగా ఆదివాసీలు, తెగలు, ఇతర అడవి బిడ్డల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపించాయని అన్నారు. 2022 జూన్ 19న అసోం ప్రభుత్వం బరక్ భుభన్ వన్యమృగ సంరక్షణ ప్రాంతం కోసం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈ ప్రాంతాన్ని అడవి బిడ్డలు బేషరతుగా ఖాళీ చేసి వెళ్ళిపోవాలి. వారికి ఎలాంటి ఉపశమనాలూ లభించవు. ఎలాంటి పరిహారాలు ఉండవు. రాతీలు ఉండవు. కానీ అక్కడి భూమి పుత్రులు ఖాసీలు ఈనాడు ప్రతిపాదించిన ఆ ప్రాంతంలో 110 సంవత్సరాలుగా అక్కడే జీవిస్తున్నారు, మరి వారి పరిస్థితి ఏమిటి? అని చక్మా ప్రశ్నించారు. రక్షిత ప్రాంతాలలో జీవించే హక్కు ఆదివాసీలకు, ఈ తెగలకు ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఐతే కొంత పరిమితమైన ఆంక్షలతో వారి జీవన విధానాన్ని అదే ప్రాంతంలో కొనసాగించాలని కోరారు.

**మానవ హక్కుల ఉల్లంఘన**

అరిజోనాలో జరిగిన సదస్సులో ప్రసంగించిన అనేక మంది వక్తలు మానవ హక్కుల ఉల్లంఘనల గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోని అనేక దేశాలలో ఆదివాసీలు, తరతరాలుగా నివసిస్తున్న భూమి పుత్రులు సామూహికంగా మానవ హక్కుల ఉల్లంఘనలను ఎదుర్కొంటున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండోనేసియాలోని ఉజుంగ్‌కులోన్ జాతీయ వనంలో దేశీయ ప్రజలకు నివసించే హక్కులను తిరస్కరించారు. వారికి బయట ప్రపంచంలోకి వస్తే సరైన ఇళ్ళుగానీ, విద్య, వైద్య సదుపాయాలుగానీ లేవు. విద్యుత్ సదుపాయం లేదు, ముఖ్యంగా బాహ్య ప్రపంచం నుండి, తెలియని కొత్త ప్రపంచం నుండి వారికి ఎలాంటి భద్రతా లేదు, కంబోడియాలో భూమి పుత్రుల నాయకుడు హెంగ్ సఫెన్ మాట్లాతూ, బెంగ్ పెర్ వన్యమృగ సంరక్షణ ప్రాంతలో ఉంటే శిక్షార్హులుగా మారారని అన్నారు.కంగారూ ప్రాంతంలో తన సొంత భూమిని దున్నుకున్నందుకు ఆయన శిక్షార్హుడయ్యాడు. విచిత్రం ఏమిటంటే కంబోడియాలో బోటమ్ సకోర్ జాతీయ పార్కును ఒక ప్రైవేటు ఇన్వెస్టిమెంట్ సంస్థకు అప్పగించిన తరావ్త రెండేళ్ళ కాలంలోనే ఈ అటవీ భూమి 18 శాతం మేరకు తగ్గిపోయింది. వారి హయాంలో దురాక్రమణకు గురైందని ఈ అంతర్జాతీయ సదస్సు ప్రధానంగా గుర్తించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేటీకరణ విపరీతగా పెరిగిపోవడంవల్ల ఎకో టూరిజం పేరుతో రక్షిత ప్రాంతాలకు టూరిస్టుల తాకిడి పెరిగింది. దీనివల్ల కూడా జీవ వైవిధ్య రక్షణకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇది అతిపెద్ద సవాలు కూడా. ప్రస్తుతం ఉన్న గిరిజనులను తొలగించి మరో పద్ధతితో దానిని వాణిజ్య ప్రాంతాలుగా మారుస్తున్నారు!! వారి సంప్రదాయ నివాసాలను, దుస్తులను పుణికి పుచ్చుకుని వ్యాపారం ప్రారంభించారు. సంప్రదాయ నృత్యాలు చేస్తున్నారు. కానీ అవన్నీ చేసేది అక్కడ బతికే ప్రజలు కాదు, వారికి ఆ విధమైన ఆర్థిక అవకాశాలు లేవు.

# ఫైనల్ మ్యాచ్ చెన్నైలోనే

### ఐపిఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల



**ముంబయి :** బిసిసిఐ తాజాగా ఐపిఎల్ 17వ సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే తొలి విడత షెడ్యూల్‌ను అమలు చేయగా, రెండో షెడ్యూల్‌ను కూడా తాజాగా వెల్లడించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడీ స్టేడియంలో క్వాలిఫయర్–1 (మే 21న), ఎలిమినేటర్ (మే 24న) నిర్వహించనున్నారు. ఇక ఈ లీగ్ ఫైనల్ చెన్నై వేదికగా జరగనుంది. ప్రస్తుత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌తో ఓవరాల్‌గా 74 మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా రెండో విడత షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇక ఈ మ్యాచ్‌లు ఏప్రిల్ 8 నుంచి ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా తొలి మ్యాచ్ చెన్నై, కోల్‌కతా జట్లు తలపడనున్నాయి. అయితే గతంలో ఐపిఎల్ 2024 రెండో షెడ్యూల్ యుఎఇలో జరుగుతుందన్న వార్తలు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆ వేదికను బిసిసిఐ ఎంచుకున్నట్లు రూమర్స్ వచ్చాయి. అయితే అందులో వాస్తవాలు లేవని మిగతా మ్యాచ్‌లు కూడా భారత్‌లోనే జరగనున్నట్లు బిసిసిఐ సెక్రటరీ జై షాతో పాటు ఐపిఎల్ చైర్మన్ అరుణ్ దుమాల్ తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఐపిఎల్ నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు చెప్పలేదని, దాని కోసమే మిగతా మ్యాచ్‌లను కూడా స్వదేశంలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ధోనీ కోసమే ఫైనల్స్ :

దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీకి ఘన వీడ్కోలు పలికేందుకే 2024 ఐపిఎల్ ఫైనల్‌ను చెన్నైలో నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయించిందని అభిమానులు అంటున్నారు. ధోనీ ఇప్పటికే కెప్టెన్సీకి వీడ్కోలు చెప్పేశాడని మహీ వయస్సు కూడా 42 ఏళ్లని కొందరు గుర్తు చేస్తున్నారు. ఆ ప్రకారం ధోనీకి ఇదే చివరి ఐపిఎల్ అని అతనికి ఘన వీడ్కోలు పలికేందుకే ఐపిఎల్ మ్యాచ్‌లను ఫిక్స్ చేసి చెన్నై జట్టు ఫైనల్ సొంత మైదానంలో ఆడేలా బిసిసిఐ ప్లాన్ చేస్తోందని కామెంట్లు పెడుతున్నారు.

**హైదరాబాద్ వేదికగా జరగనున్న మ్యాచులు ఇవే :**

ముంబయి x హైదరాబాద్ : మార్చి 27
చెన్నై x హైదరాబాద్ : ఏప్రిల్ 5
బెంగుళూరు x హైదరాబాద్ : ఏప్రిల్ 25
రాజస్థాన్ x హైదరాబాద్ : మే 2
లక్నో x హైదరాబాద్ : మే 8
గుజరాత్ x హైదరాబాద్ : మే 16
పంజాబ్ x హైదరాబాద్ : మే 19

**ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇవే :**

క్వాలిఫయర్–1 మే 21 : అహ్మదాబాద్
ఎలిమినేటర్ మ్యాచ్ మే 22 : అహ్మదాబాద్
క్వాలిఫయర్–2 మే 24 : చెన్నై
ఫైనల్ మే 26 : చెన్నై

## మరింత దృఢంగా భారత్–సింగపూర్ బంధం

### ప్రధాని లీతో జైశంకర్ సమావేశం

**సింగపూర్ :** భారత్–సింగపూర్ మధ్య సంబంధాలు మరింత దృఢతరమయ్యేందుకు, వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకునేందుకు విదేశాంగ మంత్రి జైశంకర్ సోమవారం సింగపూర్ ప్రధానమంత్రి లీ హైసియన్ లూంగ్‌తో చర్చలు జరిపారు. అదేవిధంగా ఆ దేశ విదేశాంగమంత్రి వివియన్ బాలకృష్ణన్, ఇతర సీనియర్ మంత్రులతో కూడా ఆయన సమావేశాలు జరిపారు. అవిధంగా ఇండో–పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతాలలో పరిస్థితులపై కూడా ఇరు దేశాల నాయకులు చర్చలు జరిపారు. మూడడురోజులపాటు పర్యటన నిమిత్తం జైశంకర్ శనివారంనాడు సింగపూర్ వెళ్ళారు. శనివారంనాడు ఇన్వెస్టర్లతో, ఆదివారంనాడు భారత నివాసితులు, వారి సంతతితో సమావేశాలు జరిపారు. సోమవారం సింగపూర్ ప్రధానమంత్రితో భేటీ అయ్యారు. ఆయనకు శుభాకాంక్షలుతెలిజేశారు.రెండు దేశాలమధ్య సానుకూల సంబంధాలను లీ కోరుకుంటున్నారని జైశంకర్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. వాణిజ్యం, పరిశ్రమలుమంత్రి కిమ్ యంగ్, సీనియర్ మంత్రి, జాతీయ భద్రతా సమన్వయకర్త టియో ఛీ హియాన్‌లతో కూడా ఆయన సమావేశాలు జరిపారు. ఆర్థికమంతిత్రి లారెన్స్ వోంగ్, హోంమంత్రి కె.షన్ముగంలతో చర్చలు జరిపారు. సింగపూర్ ఆర్థికమంత్రి బాలకృష్ణన్‌తో సమావేశంపట్ల ఆయన ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు దేశాలమధ్య ఆరవై సంవత్సరాలుగా దౌత్య సంబంధాలు కొనసాగుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.



## ఘనంగా హోలీ జరుపుకున్న పోలీసులు

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా పోలీసులతో కలిసి హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుండి సాయుధ పోలీసులతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బంగ్లాకు వెళ్లి స్వయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకొని ఎస్పీ పోలీస్ సిబ్బందితో కలిసి ఆనందోత్సవాలతో నృత్యాలు చేస్తూ పోడి రంగులు చల్లుతూ సందడి చేశారు. అనంతరం జిల్లా పోలీసులకు వారి కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపి రంగులమాయం చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సంబరాల్లో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, డిఎస్పీ లింగయ్య, ఎస్‌బి సిఐ రాంలాల్, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐ శివశంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాసం దగ్ధం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** గొర్రె పిల్లలు పశువుల మేత కోసం కొనుగోలు చేసి తెచ్చుకున్న వరిగడ్డి, వేరుశనగ పొట్టు అగ్నికి ఆహుతి అయిన ఘటన మండల పరిధిలోని నాగర్ల బండ తండాలో చోటు చేసుకుంది. బాధితుడు రాత్లావత్ ప్రకాష్ జీవనోపాధి కోసం 30 గొర్రె పిల్లలను, నాలుగు పశువులను కొనుగోలు చేసుకొని మేపుతున్నాడు. వాటి మేత కోసం వరిగడ్డి, వేరుశనగ పొట్టును రూ. 50వేలతో కొనుగోలు చేసి ఇంటికి సమీపంలోనే భద్రపర్చాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో పొట్టు వాము నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి పొట్టువాము పూర్తిగా అగ్నికి ఆహుతి అయిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బాధితుడని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## టికెట్ రాలేదని పురుగుల మందు తాగిన ఎంపి

**చెన్నై:** టికెట్ రాలేదని ఓ ఎంపీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గానికి గణేశ మూర్తి (74) ఎండీఎంకే పార్టీ నుంచి ఎంపీగా ఉన్నారు. ఆయనకు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ టికెట్ నిరాకరించింది. ఎండీఎంకే తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకేతో చేతులు కలిపింది. పొత్తులో భాగంగా కొన్ని సీట్లను అధికార పార్టీకి త్యాగం చేశారు. ఇందులో ఈరోడ్‌కి డీఎంకే నుంచి ప్రకాశ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కి సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్న ఈయనకే ఈరోడ్ టికెట్ నిర్ధారణ కావడంతో ఆ నియోజకవర్గ టికెట్ ఆశించిన గణేశ మూర్తికి ఆశాభంగం తప్పలేదు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించలేక, బయటకీ చెప్పుకోలేక గణేశ లోలోపలే మదనపడ్డారు. చివరికి ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమయ్యారు. ఆదివారం రాత్రి 10 గంటలకు ఆయన పురుగుల మందు తాగారని కుటుంబ సభ్యులు చెప్పారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. టికెట్ నిరాకరించిన కారణంతో ఆయన తీవ్ర ఒత్తిడికి గురయ్యారని వారు అంటున్నారు. 40 ఏళ్లకుపైనే రాజకీయాల్లో ఉన్న ఆయన ఇలా బలవన్మరణానికి పాల్పడటం ఆందోళన కలిగించిందని అభిమానులు అంటున్నారు. 2009, 2019లో రెండు సార్లు గణేశ మూర్తి ఈరోడ్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. గతంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర మంత్రిగా కూడా పని చేశారు. అయితే ఎంపీ బలవన్మరణంపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. రాజకీయ కురువద్ధుడిగా మారిన ఆయనకు టికెట్ ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ రాలేదనే కారణంతో బలవన్మరణానికి పాల్పడిన తొలి ఎంపీ అయ్యారు.





## కేరింతలతో రంగుల హోలీ సంబరాలు


**ప్రజాపక్షం / పాన్‌గల్ :** పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో రంగుల హోలీ సంబరాలను కేరింతలతో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఘనంగా జరుపుకున్నారు. ఐక్యమత్యాన్ని పెంపొందించేలా కులమతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందోత్సవాలు నిండాలని ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వీధులలో తిరుగుతూ హోలీ సంబరాలను జరుపుకున్నారు.

## పండుగలు ఐక్యమత్యానికి నిదర్శనం

### జర్నలిస్టులతో హోలీ సంబరాలలో జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్







**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పండుగలు ఐక్యమత్యానికి దోహదపడతాయని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో జర్నలిస్టులతో కలిసి ఆయన హోలీ సంబరాలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మనుషులను దగ్గరచేస్తాయని ఈయాంత్రిక జీవనంలో మనం అందరిని కలవడానికి ప్రయత్నంచేయాలని అప్పుడే మానసిక ప్రశాంతత ఐక్యత బలపడుతుందని అన్నారు. జర్నలిస్టులతోపాటు పోలీసు కుటుంబసభ్యులతో ఎస్‌పి హోలీ సంబరాలలో పాల్గొన్నారు. హోలీ సంబరాలలో సీనియర్ జర్నలిస్టు అబ్దుల్లాఖాన్, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఖానాపురం ప్రదీప్, రాజేష్‌గౌడ్, బాలస్వామి, ఫోటోజర్నలిస్టు కపిలవాయిరాజు, సుధాకర్‌రెడ్డి, శేఖర్, రామకృష్ణ, సైదులు పాల్గొన్నారు.

### పెద్దకొత్తపల్లి...

మండలంలోని కల్వకోల్, పెద్దకొత్తపల్లి, చెన్నపురావుపల్లి, సాతాపూర్, యాపట్ల, దేవునితిర్మలాపూర్ తదితర గ్రామాలలో యువకులు, విద్యార్థులు, మహిళలు హోలీపండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు విద్యార్థులు ఒకరికి ఒకరు రంగులుచల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దకొత్తపల్లి ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పిటిసి మేకలగౌరమ్మయాదవ్ మండలప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### కల్వకుర్తి...

రంగులకేలిహోలీ పండుగ సంబరాలు సోమవారం కల్వకుర్తి పట్టణంతోపాటు మండలంలో ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మహాసభ వాసవిక్లబ్ ఆవోప ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయం నుండి ప్రధాన రహదారులవెంట బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. డిజె ఆటపాటలతో నృత్యాలుచేశారు. రంగులతో నిండిపోయారు. కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్‌బాబు, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధానకార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, వాసవిక్లబ్ అధ్యక్షుడు చిదిరే శ్రీనివాస్, కోశాధికారి దుగ్గిసత్యనారాయణ, ఆవోప అధ్యక్షుడు సతీష్ గుప్తా, రైస్‌మిల్లర్స్ సమన్వయకర్త కందిప్రవీన్, కొండూరు కృష్ణయ్య, రవి, సత్యనారాయణ, లింగం, గోవింద,ప్రకాశ్, శ్రీనివాస్, క్రిష్ణయ్య తోపాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రమైన వీపనగండ్లలో ఇటీవల పాముకాటు గురై మరణించిన ఎరుకలి దొబ్బలయ్య కుటుంబానికి గ్రామంలోని పలువురు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఎరుకలి దొబ్బలయ్య కులవృత్తి పనులలు చేసుకుంటూ తండ్రి నేర్పిన విద్యతో పాములు పడుతూ వాటిని ఆడిస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల క్రితం ఇంటి వద్ద కుండలో భద్రపర్చి పామును బయటకు తీస్తుండగా పాము కాటు గురై ఎరుకలి దొబ్బలయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. కుటుంబ పెద్ద దిక్కు ఆకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలోని పలువురు మానవత దృక్పథంతో కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ. 22వేలను మృతుడి భార్య బాలకిష్ణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు సాయిబాబు, ముంత రాజు, మహేష్ నాయుడు, బాలపిర్ తదితరులు ఉన్నారు.

## తరతమ భేదాలు లేకుండా చేసుకునే పండుగ హోలీ

సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హోలీ పండగ జరుపుకుంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో హోలీ పండుగను పురస్కరించుకొని సిపిఐ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ పండుగలు అనేవి సాంప్రదాయాలను గుర్తు చేస్తాయన్నారు. హోలీ వేడుకల్లో అందరూ ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే పండుగ హోలీ అని, అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం పోరాడాలని సూచించారు. ఈ పండుగ మీ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, జి.శ్రీనివాస్, పోశం, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సబ్ జూనియర్ క్యారం పోటీలకు సందీప్ ఎంపిక



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** హైదరాబాద్ నాగోల్‌లో క్యారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు మంచి ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న జాడి సందీప్ జాతీయస్థాయి క్యారం పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో నిర్వహించే జాతీయస్థాయి క్యారం పోటీలలో సందీప్ పాల్గొననున్నట్టు తెలిపారు. అనంతరం సందీప్‌ను పాఠశాల సిబ్బంది సట్ల శంకర్, కోట యాదగిరి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారం అసోసియేషన్, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

## కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన నీరజ్




**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేట మండల పరిధిలోని మింపూర్ గ్రామానికి చెందిన నీరజ్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. సోమవారం హైదరాబాదులోని బోడుప్పల్‌లో కల ఐ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలలో నీరజ్ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఈ పోటీలలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో పాల్గొన్నారు. పరీక్షలకు నిర్వాహకులుగా రింగ్జాకి చోటకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ క్లబ్ ఫౌండర్ మాస్టర్ నగేష్ వ్యవహరించగా, నవీన్ మిథున్ లావణ్యాలు ఎగ్జామినర్స్ పర్యవేక్షకులుగా ఉన్నారు. నీరజ్ ఐదు సంవత్సరాలుగా మెదక్ గుల్షన్ క్లబ్ లో మాస్టర్ దినాకర్ వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. నీరజ్ చదువుతోపాటు ఆటలు, కరాటేలో ప్రావీణ్యత కలవాడని, కరాటే నేర్చుకోవడం కరాటే పోటీలలో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడని మాస్టర్ పేర్కొన్నారు. మిన్పూర్ మాజీ ఎంపీటీసీ మంజుల శ్రీనివాస్ దంపతుల కుమారుడు నీరజ్ చిన్న తనంలోనే బ్లాక్ బెల్ట్ సాధించడం పట్ల మిన్పూర్ గ్రామస్తులు, పాపన్నపేట ప్రెస్ క్లబ్ సభ్యులుతో పాటు పలువురు ప్రశంసించారు.

## దివ్యాంగులకు ఆచార్య ఐలయ్య సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/హన్మకొండ :** గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ వడ్డేపల్లిలోని విజయపాల్ కాలనీలో ఉంటున్న ఆచార్య బన్న ఐలయ్యను సోమవారం దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆచార్య బన్న ఐలయ్య ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రధానాచార్యులుగా పదవీ విరమణ పొందిన సందర్భంగా సంఘం తరపున వారికి శాలువా, మెమెంటో అందించి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఆచార్య బన్న ఐలయ్య అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆచార్య బన్న ఐలయ్య దివ్యాంగులపై ఎనలేని ప్రేమ చూపుతారని, దివ్యాంగులైన పరిశోధన విద్యార్థులను ప్రోత్సహించి ఎందరినో డాక్టరేట్ చేసిన ఘనత ఆయనదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి నున్న నరసమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కడుదుల సోమన్న, కార్యదర్శులు స్వరూప, మల్లికార్జున్, చారి, దామోదర్, నట్య పాల్గొన్నారు.

## హాస్టళ్ల మరమ్మతులకు నిధులు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ప్రభుత్వ బిసి హాస్టళ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ఆ శాఖ మంత్రికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం బిసి హాస్టళ్ల మరమ్మత్తులకు ఒక్కపైసా కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, అధ్వాన్నంగా ఉన్నాయని, మంచినీటి సౌకర్యం అందుబాటులో లేని హాస్టల్స్ చాలా ఉన్నాయన్నారు. రాబోయే విద్యాసంవత్సరంపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రభుత్వ హాస్టళ్లలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సరిహద్దుల్లో విస్తృతంగా తనిఖీలు

**ప్రజాపక్షం/గజ్వేల్ :** లోక్‌సభ ఎన్నికల నేపధ్యంలో కమిషన్ నిబంధనల మేరకు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా సరిహద్దు వంటిమామిడి చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు కానీ, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2,36,000 తీసుకొని వెళుతున్న ఒకరి నుండి డబ్బులు స్వాధీనం చేసుకొని కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌లో డిపాజిట్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ.50వేల కంటే ఎక్కువగా ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా సం బంధిత వ్యక్తి కలిగి ఉండాలన్నారు. కాగా చెక్ పోస్ట్ లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24గంటలు విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని, తనిఖీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వచ్చిపోయే ప్రతి వాహనాన్ని పరిశీలిస్తూ తనిఖీ చేయాలని, రాత్రి సమయాల్లో తనిఖీ చేసేటప్పుడు టార్చ్ లైట్ తప్పక ఉపయోగించాలని వివరించారు. ఆయనతో



పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### సరిహద్దు చెక్ పోస్టు ఏర్పాటు

**చింతలపాలెం(మేళ్లచెర్వు) :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు బుధవాడ వద్ద పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ సిఐ రజితరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద నిరంతరం వాహనాల తనిఖీ ఉంటుందన్నారు. సరిహద్దు ద్వారా డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల



మేరకు రూ.50వేల కంటే ఎక్కువగా ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా ప్రయాణికులు కలిగి ఉండాలన్నారు. చెక్‌పోస్టు వద్ద ఏమైనా వాహనాలు, వ్యక్తులు అనుమాస్పదంగా ఉంటే వెంటనే కట్టడిచేసి అధికారులకు వాటి వివరాలు పంపించాలన్నారు. నిరంతరం గస్తీతో పాటు మఫ్టీలో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. చెక్ పోస్ట్ లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని, తనిఖీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రయాణికులు చెక్‌పోస్టుల వద్ద పోలీసులకు సహకరించాలన్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ, స్థానిక ఎస్ఐ పరమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## చెరువులు, కుంటలు నింపాలని రైతుల నిరసన



**ప్రజాపక్షం/బచ్చన్నపేట :** దేవాదుల కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపి ఎండిపోతున్న రైతుల పంట పొలాలను కాపాడాలని రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి కొత్తపల్లి బాలనర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో చిన్నరామన్‌చర్ల శివారు మొండికుంట స్టేజి వద్ద సోమవారం ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలలో చిన్నరామన్‌చర్ల గ్రామంలో వందలాది ఎకరాల పంట వడగళ్ల పాలయిందని, నష్టపరిహారం అందిస్తామన్న గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఇప్పటికయిన రాష్ట్రప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామగళ్ల అశోక్, బుర్రి సుధాకర్, అన్నెబోయిన శ్రీనివాస్, అన్నబోయిన రాజు, గంధమాల మనోహర్, రేణిగుంట ఆంజనేయులు, రేణిగుంట వెంకటేశ్వర్లు, తురుకపెల్లి భాను, గుడికందుల నాగరాజు, గుడికందుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల మెరుపు దాడులు

మూడు ఇసుక లారీలు, ఒక జెసిబి పట్టివేత

**ప్రజాపక్షం/ముత్తారం :** అర్ధరాత్రి వేళలో ఎలాంటి అనుమతులు లేకుండా దుబ్బ రవాణా పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలతో పాటు ఒక జెసిబి, ఒక కారుని ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు తన సిబ్బందితో మెరుపు దాడి చేసి పట్టుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామపంచాయతీ పరిధిలోగల మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రి వేళలో జెసిబి సహాయంతో మూడు ఇసుక లారీలలో ఇసుకను నింపుకొని తరలిస్తున్నారనే





నమ్మదగిన సమాచారం మేరకు ఓడేడ్ మానేరు వద్ద తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న లారీ నెంబర్ టీఎస్ 02 యు బి 8888, టీఎస్ 30 టీ 7029, టీఎస్02 యు బి2535 లారీలతోపాటు టీఎస్ 16 ఎఫ్ డి 5954 ఒక జెసిబి ని పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. అలాగే కట్టుకున్న ఇసుక లారీలు, జెసిబి లపై కేసు నమోదు చేసి మైనింగ్, టి ఎస్ ఎం డి సి అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు హెచ్చరించారు. దాడుల్లో ముత్తారం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మధునయ్య, హోంగార్డు గోపాల్, టీఎస్ఎండిసి అధికారులు, మైనింగ్ అధికారులు ఉన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో తండాల అభివృద్ధి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

గిరిజన తండాల్లో హోలీ సంబరాలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మండలంలోని గిరిజనుల తండాల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తండావాసులతో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తుర్కపల్లి మండలంలోని నాగాయపల్లి తండాలో సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొని, రంగులు పులుముకొని బంజారా పాటలతో నృత్యాలు చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ ప్రజలందరూ తన కుటుంబ సభ్యులేనని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని గిరిజన సోదరులందరూ తనకు భారీ మెజార్టీ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించారని మీ రుణం తీర్చుకోలేనిదని అన్నారు. గ్రామాన్ని నాగాయపల్లి నుండి కర్కపట్ల రోడ్డు దగ్గరుండి వేయిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజల ప్రభుత్వమని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో తండాలు, గ్రామాలు అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుడిపాటి మధుసూదన్ రెడ్డి, శంకర్ నాయక్, ఎంపీటీసీ కోమటిరెడ్డి సంతోష భాస్కర్‌రెడ్డి, చాడ భాస్కర్‌రెడ్డి, ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్ బాబు నాయక్, షెట్టయ్య, ఇంద్రపాల కృష్ణ, జాగిల్లాపురం సత్యనారాయణ, బొత్త రాములు, రాజారాం నాయక్, పూలేపల్లి వెంకటేష్, కొన్నే దుర్వాసులు, పసుల సత్యనారాయణ, సముద్రాల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఉద్యోగుల సంక్షేమానికి సహకారం

ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసిన ఆర్‌టిసి నేతలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆర్‌టిసి ఉద్యోగుల సంక్షేమానికి సహకారం అందిస్తానని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ భవన్‌లో ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ మొండి వైఖరితో ఆర్‌టిసి ఉద్యోగులకు కోలుకొని దెబ్బ తగిలిందన్నారు. ఈ ప్రభుత్వమయిన ఆర్‌టిసి ఉద్యోగుల శ్రమను గుర్తించాలని, యూనియన్‌లు లేక యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు కార్మికులను వేధిస్తుందని, పనిగంటలు పెంచి కార్మికులకు, రెస్ట్ లేకుండా డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. బెదిరించి డ్యూటీలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. అత్యవసరం ఉన్న ఒక్క రోజు కూడా లీవ్ ఇవ డం లేదన్నారు. అత్యవసరంగా విధులకు హాజరు కాలేకపోతే పనిష్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. ఛార్జ్ షీట్ ఇచ్చి ఇంక్రిమెంట్‌లు కట్ చేస్తున్నారన్నారు. చాలీచాలని జీతంతో ఉద్యోగం చేయాలి, పైగా అన్నిటిని ఓర్చుకొని ఆర్‌టిసి ఉద్యోగులు గొడ్డు చాకిరీ చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికయిన మీరు కలిపించుకొని ముఖ్యమంత్రి దగ్గర మాగోడు వినిపించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు, ఆర్‌టిసిలో యూనియన్‌లు పునరుద్ధరించాలని కృషిచేయాలని కోదండరామ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఆర్ రెడ్డి, ఆదిలాబాద్ రీజినల్ సెక్రటరీ ఆర్.గంగాధర్, నాయకులు తమ్ముడు రాము, జి.శ్రీనివాస్, ఎస్ఆర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఉగ్రనృసింహుడి తెప్పోత్సవం

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న శ్రీ లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన శ్రీ ఉగ్ర(కొత్త) నృసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా సాగింది. ముచ్చురు స్వాముల డోలోత్సవం వేడుకలో 2వ రోజైన శ్రీ ఉగ్ర నృసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం కార్యక్రమంతో కోనేరులో దర్శనమిచ్చారు. సోమవారం సాయంత్రం ఆలయ అధికారులుచ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలలో ఉత్సవ మూర్తుల సేవలను బ్రహ్మపుష్కరిణికి తీసుకువచ్చారు. అక్కడి కోనేటి నీటిపై సిద్ధంగా ఉన్న హంస వాహనంలో స్వామివారిని కూచోబెట్టి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి వాహనం నీటిపై ఐదుప్రదక్షిణలు చేయగా నలువైపులా నున్న వేలాది మంది భక్తులు గోవిందా.. గోవిందా నామస్మరణ చేస్తూ బుక్కగులాలు, కుంకుమ చల్లుతో మొక్కుకున్నారు. అనంతరం కోనేరు మధ్య భాగంలో నున్న భోగ మండపంలో స్వామివారిని ఆశీనులు చేయించి



వైభవంగా డోలోత్సవం జరిపారు. కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, జెడ్పిటిసి బత్తిని అరుణ, ఆలయ మాజీచైర్మన్ సంగనబట్ల దినేష్ పాల్గొనగా ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, కమిటీ సభ్యులు, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మా నాయకుడిని జైల్లో పెట్టారు

మేం హోలీకి దూరం: అతిశీ




**న్యూదిల్లీ:** దేశమంతా హోలీ సంబరాల్లో మునిగి తేలుతున్న తరుణంలో ఆప్ నేత అతిశీ కీలక ప్రకటన చేశారు. దిల్లీ మద్యం కేసులో తమ నాయకుడు కేజ్రీవాల్‌ను అన్యాయంగా ఈడీ అరెస్టు చేసిందని, ఈ కారణంగా తాము హోలీ ఆడలేకపోతున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేశారు. దుర్మార్గం, క్రూరత్వం, అన్యాయంపై ఆమ్ ఆద్మీ పార్టీలో ప్రతి నాయకుడు రేయింబవళ్లు పోరాడుతున్నారని చెప్పారు. ఈ యుద్ధంలో తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. దిల్లీ, దేశం కోసం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు దిల్లీ మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తొమ్మిదిసార్లు సమన్లు పంపారు. అయినా కేజ్రీవాల్ వాటిని పట్టించుకోలేదు. దీంతో కేజ్రీవాల్ ఇంటికి చేరుకున్న ఈడీ అధికారులు రెండు గంటల పాటు విచారణ జరిపి సీఎంను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆ తర్వాత ఈ నెల 28 వరకు కేజ్రీవాల్ ఈడీ కస్టడీలో ఉంటున్నారు. ఎన్నికల కోసం ఇండియా కూటమిలో చేరిన ఆప్ మిత్ర పక్షాలతో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఈ పరిణామాల నడుమ కేజ్రీవాల్ అరెస్టు కావడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ నెల 31 ఉదయం 10 గంటలకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మెగా ర్యాలీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు దిల్లీలోని రాంలీలా మైదానం వేదిక కానుంది.

## కంప్యూటర్, పేపర్ ఇవ్వలేదు

## కేజ్రీవాల్ ఆదేశాలెలా ఇచ్చారు : ఇడి

**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీలో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేశారంటూ ఢిల్లీ మంత్రి అతిశీ మార్లీనా చేసిన ప్రకటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. కస్టడీ సమయంలో ప్రధాన కార్యాలయంలో ఉన్న కేజ్రీవాల్‌కు కంప్యూటర్ లేదా కాగితాలను తాము సమకూర్చలేదని దర్యాప్తు సంస్థ చెబుతోంది. ఈ ఆదేశాలు బయటకు ఎలా వెళ్లాయో తెలుసుకొనేందుకు సంస్థ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆ కాగితం ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకొనేందుకు ఆప్ మంత్రి అతిశిని ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. దీంతో పాటు జైల్లో కేజ్రీవాల్ కదిలికలను గమనించేందుకు సీసీ టీవీ దశ్యాలను పరిశీలించవచ్చని చెబుతున్నారు. కాగా, కేజ్రీవాల్‌ను చూసి ప్రధాని మోడీ భయపడుతున్నారని శివసేన ఉద్ధవ్ వర్గానికి చెందిన ఎంపీ సంజయ్ రౌత్ ఎద్దేవా చేశారు. రామ్‌లీలా మైదానంలో ఆప్ తల



పెట్టిన భారీ ర్యాలీకి హాజరవుతామని ఆయన వెల్లడించారు. జైలు నుంచే విధులు నిర్వర్తిస్తుండటంతో బీజేపీకి కేజ్రీవాల్ మరింత ప్రమాదకరంగా తయారయ్యారని పేర్కొన్నారు. ప్రజలకు ఆయన చెప్పేది వినటమే కాదు... మద్దతుగా తరలివస్తారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కూడా జైలుకు వెళ్లిన నాయకులు బలంగా తిరిగి వచ్చారన్నారు. మరోవైపు రామ్‌లీలా మైదానంలో 1.5 లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేయడానికి ఆమ్‌ఆద్మీ పార్టీ సన్నాహాలు చేస్తోంది. దీనిపై పార్టీ కార్యదర్శి సందీప్ పాఠక్ నాయకులకు మార్గదర్శకాలు జారీ చేశారు. మార్చి 27, 28న ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లతో కలిపి జోనల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బూత్ నుంచి 10 మంది మార్చి 31వ తేదీన రామ్‌లీలా మైదానం చేరుకొనేలా చూడాలన్నారు. దిల్లీలోని 14,000 బూత్‌ల నుంచి 1.5 లక్షల మంది హాజరవుతారని పాఠక్ పేర్కొన్నారు.

## భారీ భూకంపం (మొదటి పేజీ తరువాయి)

అంబుంటి పట్టణ సమీపంలో భారీ భూప్రకంపనలు వచ్చాయి. ఈ పట్టణ సమీపంలో 40 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే సెపిక్ నది వరదల కారణంగా తూర్పు సెపిక్ ప్రావిన్స్ ఇప్పటికే తీవ్రంగా ప్రభావితం కాగా, తాజా విపత్తుతో పరిస్థితులు మరింత దిగజారాయని పావిన్స్ గవర్నర్ ఆలన్ బర్డ్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. భూకంప ధాటికి దాదాపు వెయ్యి ఇళ్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. నది పొడవునా 800 కిలోమీటర్ల మేర 60 నుంచి 70 గ్రామాలు వరద గుప్పిట్లో ఉన్నాయని బర్డ్ మీడియాకు వెల్లడించారు. వరదల పోటెత్తడంతో ఇప్పటికే సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఈ క్రమంలోనే భూకంపం సంభవించిందన్నారు. అయితే వరదలు పెద్ద సమస్యేమీ కాదని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామన్నారు. భూకంపాన్ని ఊహించలేదని, దాని వల్ల పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. గత ఏడాది ఏప్రిల్, సెప్టెంబరులోనూ స్థానికంగా పలు భూకంపాలు నమోదయ్యాయన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com